## వివాహిత అనుమానాస్పద మృతి



మేఘున ఫైల్‌ఫోటో

వి.కోట, జనవరి 5 ప్రభాతవార్త

స్థానిక అంబ్కేర్ నగర్‌లో ఓ వివాహిత అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. అయితే తమ కుమార్తెను అత్తింటివారే హతమార్చారని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన మేరకు వివరాలిలా.. కర్ణాటకలోని తాయలూరు వద్దగల గడ్డం చిన్నేపల్లి గ్రామంకు చెందిన మేఘునకు వి.కోటకు చెందిన వినోద్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు సంతానం. అయితే మేఘున సోమవారం తమ అత్తారింట్లో ఉరేసుకుందని భర్త, కుటుంబీకులు చెబుతుండగా తమ అమ్మాయిని హతమార్చారని మృతురాలి తల్లిదండ్రులు పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారంఅందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

# తిరుపతి - చిత్తూరు




## పిజిఆర్ఎస్ అర్జీలకు పరిష్కారం చూపాలి : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జనవరి 5 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఆర్జీలకు వేగవంతంగా పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం చూపరాదని, అర్జీదారులు సంతృప్తి పొందేలా పరిష్కారం చూపాలని తెలిపారు. జిల్లా రెవెన్యూఅధికారి నరసింహులు స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

## సమస్యలకు నాణ్యమైన పరిష్కారం

### - కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ, చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్లు విజయలక్ష్మి, కరుణకుమారి, కలెక్టరేట్ ఏఓ వాసుదేవన్, చిత్తూరు రూరల్ తహసిల్దారు కళ్యాణిలు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం నాణ్యతగా వుండాలని, గడువు ముగిసేలోపు అర్జీలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్జీదారులు సంతృప్తి పొందేలా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 134 సమస్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై 134 అర్జీలు అందాయి. రెవెన్యూ, సర్వే శాఖలపై అత్యధికంగా 78 అర్జీలు అందగా డిఆర్‌డిఏ 25, పోలీసు శాఖ 10, ఎపిఎస్‌పిడిసిఎల్ 7, పంచాయతీరాజ్ 3, సివిల్ సప్లైస్ 3, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ 2, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ 2, పశుసంవర్ధకశాఖ 2 అర్జీలు అందాయి.

## ఫ్లెమింగో ఫెస్టివల్ లక్ష్యం నెరవేరేనా..!



సూళ్లూరుపేట, జనవరి 5 ప్రభాతవార్త

సూళ్లూరుపేట కేంద్రంగా 2001వ సంవత్సరం నుంచి జరుగుతున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు తిరుపతి జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు ప్రారంభించింది. జనవరి 10, 11 తేదీల్లో రెండురోజులు పాటు వైభవంగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించాలని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఛైర్మన్‌గా ఉన్న ఫెస్టివల్ నిర్వహణ కమిటీ ఇందుకు సంబంధించి సన్నాహాలు ముమ్మరం చేశారు. పులికాట్, నేలపట్టు, వెదురుపట్టు పక్షుల రక్షిత కేంద్రాల విశిష్టతను చాటుతూ నిర్వహిస్తున్న ఈ పండుగ కొన్ని లక్ష్యాలతో ప్రారంభించినప్పటికీ ఆ లక్ష్యాలు మాత్రం అంతంత మాత్రంగానే నెరవేరాయి. ఈ ప్రాంతంలో ఈ పండుగ 2001లో ప్రారంభమై అప్పుడప్పుడు ఎన్నికల కోడ్, కరోనా సమయాల్లో మాత్రం పండుగ నిర్వహణ జరగలేదు. ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్శకులతో పాటు స్థానికులకు ఆహ్లాదపరిచే కార్యక్రమంగా మారింది.

### నెరవేరని లక్ష్యం

ఫ్లెమింగో ఫెస్టివల్ పేరుతో 25 సంవత్సరాల క్రితం అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లా కలెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే పరసా రత్నం ఈ పండుగ పేరుతో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేశారు. మరోవైపు సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం ప్రాంతాల్లో అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లు వేయడం, పడవల రేవులు అభివృద్ధి, ఇతర పనులు చేపట్టడం ఇందులో భాగమే. అలాగే పర్యావరణ శాస్త్రవేత్తలను తీసుకొచ్చి పులికాట్ జీవనగతులపై అక్కడి ప్రజలకు సాయం అందించే స్వచ్ఛంధ సంస్థలను భాగస్వాములుగా చేసి సెమినార్లు నిర్వహించేవారు. ఈ సెమినార్లలో జాలర్ల స్థితిగతులు మెరుగుపరచడం, పులికాట్‌లో పక్షుల మనుగడ, జీవవైవిధ్యం వంటి అంశాలపై శాస్త్రవేత్తల అభిప్రాయాలతో కూడిన తీర్మానాలు చేసేవారు. ఈ ప్రక్రియలో భాగంగానే పులికాట్ ముఖద్వారాల పూడికతీత అనే అంశం అప్పటి నుంచి తెరపైకి వస్తూనే ఉంది. ప్రస్తుతం ఈ కార్యక్రమాలన్నీ ఫ్లెమింగో ఫెస్టివల్‌లో అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. కేవలం ఆహ్లాదం, వినోదం కోసం ఏర్పాటు చేసే కార్యక్రమాలకే పండుగ పరిమితమైంది. రెండురోజుల పాటు పులికాట్ గురించి, పక్షుల సంరక్షణపై ఏర్పాటు చేసిన ప్రారంభ, ముగింపు సమావేశాల్లో ముఖ్య అతిథులుగా వచ్చిన రాష్ట్రమంత్రులు, కేంద్రమంత్రులు హామీలిచ్చి హడావిడి చేయడం పరిపాటిగా మారింది. అంతేగాని అసలు పులికాట్, నేలపట్టు, వెదురుపట్టుతో పాటు బివిపాలెం పడవల రేవు అభివృద్ధి, ఇతర అంశాలను పండుగ రోజు మాత్రం గుర్తు చేసుకుని పండుగను అయిందనిపించడంతో సరిపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా నేతలు, అధికారులు పండుగ ముఖ్య లక్ష్యాన్ని నెరవేర్చాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## కుంకి ఏనుగు దాడిలో అటవీ అధికారికి స్వల్ప గాయాలు..!

రామకుప్పం, జనవరి 5 ప్రభాతవార్త

మండలంలోని ననియాల ఏనుగులు పర్యాటక కేంద్రంలోని శిక్షణ ఏనుగు దాడిలో ఓ అటవీ అధికారికి స్వల్ప గాయలైన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్లైతే.. పర్యాటక కేంద్రంలో జయంత్, వినాయక్ అనే రెండు కుంకి ఏనుగులు ఉన్నాయి. కాగా జయంత్ అనే కుంకి కి విరోచనాలు కావడంతో తిరుపతి జూపార్క్ వైధ్యులతో చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రెండు ఏనుగులకు వైద్యం అందిస్తుండగా వినాయక అనే ఏనుగు తొండం విదిలించడంతో అక్కడే ఉన్న ఫారెస్ట్ బీట్ అధికారికి దంతం తగిలి ముఖం మీద స్వల్ప గాయమైందని సమాచారం. ఈ విషయమై ఫారెస్టర్ హరి కుమార్ ను వివరణ కోరగా బాలసుబ్రమణ్యం అనే అధికారి స్వల్పంగా గాయపడ్డరని తెలిపారు.

## 30 ఏళ్ళ ప్రస్తానంలో ఎన్నో సంచలనాలు

### వార్త దినపత్రిక క్యాలండర్లను ఆవిష్కరించిన ఇఓ



శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త

వార్త దినపత్రిక 30సంవత్సరాల ప్రస్తానంలో ఎన్నో ఒడుదుడుకులను ఎదుర్కొని విజయపథంలో నడుస్తుందని శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఛాంబర్‌లో వార్త 2026 క్యాలండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తికి సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా పూర్తి సమాచారం ఇవ్వటంలో ప్రాధాన్యత ఇస్తున్నారని అభినందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన అభివృద్ధికి సంబంధించి ఇచ్చిన ప్రోత్సాహం అంతా ఇంతా కాదన్నారు. 1996లో ప్రారంభమైన వార్త దినపత్రిక పత్రికా రంగంలో సరికొత్త వరవడి తెచ్చిందన్నారు. నిష్పపాత వైఖరి వార్త మేనేజ్‌మెంట్ నైజం అన్నారు. ఎన్నో పోటీ పత్రికలు వచ్చిన వార్త తన మనుగడను కొసాగించుకుంటూ ముందుకు వెళుతుందన్నారు. ఈ సంస్థలో మంచి అనుభవం ఉన్న జర్నలిస్టులు ఉన్నారని ఎన్నో మంచి కథనాలను అందిస్తున్నారని బాపిరెడ్డి అన్నారు. ఈ అవిష్కరణలో మొదట వాయులింగేశ్వరుని చిత్రపటాల వద్ద పెట్టి పూజలుజరిపారు. ఆలయ ఇఓతో పాటు డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ శ్రీనివాసులురెడ్డి వార్త టీం పాల్గొన్నారు.

## నా బలం నా పేదలే

### ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



వాకాడు, జనవరి 5, ప్రభాతవార్త

పార్టీలకు అతీతంగా పేదవాళ్ళకి న్యాయం చేయాలని గూడూరు శాసనసభ్యుడు డాక్టర్ పాశం సునీల్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాసనసభ్యుడు డాక్టర్ పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా దర్బార్ రూపకర్త మంత్రి నారా లోకేష్ అని ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో పేద ప్రజలకు అధికారులు న్యాయం చేయాలని తెలిపారు. ప్రజా దర్బార్లో వచ్చిన అర్జీలకు తక్షణమే అధికారులు స్పందించాలన్నారు. మండలంలోని ఆయా పంచాయతీలో ఉన్న నాయకులు ఇంటి వద్ద ఉండకుండా ప్రజల కోసం అందుబాటులో ఉండి ప్రభుత్వ కార్యాలయంలో పని చేయించాల్సిన బాధ్యత నాయకులు మీద ఉందన్నారు. పేదోలు పనులు సకాలంలో అధికారులు చేయకపోతే తాను అధికారులను ఏం చేయాలో నాకు బాగా తెలుసు అన్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేశారని సగర్వంతో మీ ముందు చెప్పుకుంటున్నామన్నారు. మహిళల కోసం ఉచిత బస్సులు తో పాటు మహిళలకు రావలసిన అన్ని సంక్షేమ పథకాలు చంద్రబాబు నాయుడు ఇస్తున్నారు అన్నారు. పేదోలకి రాజముద్రతో పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. గత వైసిపి పాలనలో ఒక సెంటు భూమి ఇచ్చి ఇల్లు కట్టుకోలేని దుస్థితిలో పేదోలు ఉన్నారని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వగానే మూడు సెంట్లు ఇంటి స్థలంతో పాటు పక్కా గృహం కూడా మంజూరు చేస్తానన్నారు. మండలంలోని పక్కా గృహాల ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులు గత వైసిపి ప్రభుత్వం లో ఒక్క రూపాయి ఆన్లైన్లో పడి ఆగిపోయిన గృహాలకు త్వరలో బిల్లులు పడతాయని ఎమ్మెల్యే లబ్ధిదారులకు శుభవార్త తెలిపారు. టిడిపి కార్యకర్తలు గురించి వైసిపి నాయకులు రకరకాల ప్రెస్మీట్లో ఇస్తున్నారని ఆధారాలు లేకుండా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. దుగ్గరాజ పట్నం గ్రామంలోని నౌక మరమత్తుల కేంద్రం సుమారు 4వేల కోట్ల రూపాయలతో మంజూర అయిందని ఇండియాలో టాప్ ఫైవ్‌లో ఒకటిగా నిలిచిందన్నారు. వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. వాకాడు మండలం తిరుపతి జిల్లాలోనే కొనసాగడం చంద్రబాబు నాయుడు కి అభినందనలు తెలిపారు అన్నారు. నాయుడుపేట నుండి దుగరాజపట్నం పోర్టు వరకు ఆరు లైన్లతో రోడ్లు తొందరలోనే వస్తాయన్నారు. మండలంలోని పేద ప్రజలందరికీ అధికారులు న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, ఏఎంసీ చైర్పర్సన్ ప్రమీల, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, దువ్వూరు జనార్ధన్ రెడ్డి, చరణ్ రెడ్డి, అరుణ్ కుమార్, బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వల్లి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు లక్ష్మి ప్రసాద్ రెడ్డి, తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, డిప్యూటీ ఎంపీడీవో దేవదానం, ఎంఈఓలు ఆనంద్ బాబు, నసీం అలీ, పి ఆర్ ఏ ఈ కిరణ్, ఆర్డబ్ల్యూఎస్ సుమాంజలి, ఎండిఓ రెడ్డి నాయక్, విద్యుత్ ఏఈ విజయలక్ష్మి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, వివిధ శాఖల అధికారులు, వైద్యాధికారి రోహిత్ జేమ్స్, టిడిపి నాయకులు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, హరీష్ నాయుడు, మాజీ జడ్పిటిసి సభ్యులు ప్రమీల, ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి, నెల్లూరు సుధాకర్ రెడ్డి, తిరుమురు శ్రీనివాసరెడ్డి, అన్నమేటి చంద్రయ్య, కోట శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రాజగోపాల్ రెడ్డి, ఎంబేటీ పోలయ్య, బిజెపి నాయకుడు ఆగస్తి మణి, తదితరులు పాల్గొన్నారు. ప్రజా దర్బార్ కార్యాలయం ఆవరణ వద్ద మెడికల్ క్యాంపు జరిగింది.

## ఆలయాల సమాచారం ఇవ్వటంలో వార్త ముందంజ



ఏర్పేడు, జనవరి 5 ప్రభాతవార్త

ఆలయాల సమాచారాలను ఇవ్వటంలో వార్త ముందంజలో ఉందని గుడిమల్లం ఆలయ ఛైర్మెన్ బత్తల గిరినాయుడు అన్నారు. గుడిమల్లం ఆలయంలో సోమవారం ఆయన వార్త 2026 క్యాలండర్లను ఆవిష్కరించారు. అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయంలో క్యాలండర్లను పూజలు నిర్వహించారు. తరువాత కొత్త క్యాలండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఆలయాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని విస్తృత ప్రచారాన్ని అందించుటంలో వార్త దినపత్రిక కీలకంగా వ్యవహరిస్తున్నారని గిరినాయుడు అన్నారు. వార్తలను నిష్పక్షపాతంగా అందించటం అభినందనీయం అన్నారు.

## ఏ భూమి అయితే మాకేంటి

## మా జేబులు నిండితే రిజిస్ట్రేషనే!

### ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే రెవెన్యూకు తెలియదు!



రిజిస్ట్రేషన్ చేసిన రోడ్డుపక్కన ఇళ్ళు ఇవే

తొట్టంబేడు, జనవరి 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణానికి చుట్టూ తొట్టంబేడు మండలం ఉంది. ఈ మండలంలోని ప్రభుత్వ భూములు కోట్లు విలువ చేస్తాయి. కొత్తగా ఓ వివాధాస్పద అంశం వెలుగు చూసింది. ఎంజిఎం ఆసుపత్రికి పరిసరాలు సర్వే నెంబర్ 106. ఈ సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని సర్వే నెంబర్ 70/1గా చూపి ఎంచక్కా రిజిస్ట్రేషన్ చేసేసారు. అయితే ఈ ఆక్రమణలు నాలుగు సంవత్సరాల రోడ్డు పక్కన ఆక్రమించుకొని కట్టుకున్న కట్టడాలకు దృవీకరణలు ఎవరు ఇచ్చారు? ఎప్పుడు ఇచ్చారు? ఏ ఆధారాలతో ఇచ్చారు. ఎవరెవరు సహకరించుకున్నారో ఎవరికి అంతుపట్టడం లేదు. నేడు తప్పుడు సర్వే నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసిన భూమి విలువ రూకొటిన్నర. ఆక్రమణకు గురైంది ఇంతా అంతా కాదు. 2,500 చదరపు అడుగులు. ప్రభుత్వ భూమిని క్లాసిఫికేషన్ సర్వే నెంబర్ మార్చి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ముడుపులు ముట్టజెప్పి జేబులు నింపి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఆరోపణలున్నాయి. చట్టంలో ఎన్ని లోసుగులు వెసులుబాట్లు ఉన్నాయో అన్ని ఉపయోగించి అధికారులు తమ పబ్బం గడుపుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదు. అయితే ఏ శాఖ అధికారి అయినా మేము ఇవ్వాల్సిన వాళ్ళకు పంపాలి కదా? అంటూ ఎదురు ప్రశ్న వేస్తున్నారు. వ్యవస్థలు పూర్తిగా అవినీతి కూపాలుగా మారాయి. అదుపు లేదు. అడిగే దిక్కులేదు. ఇలాంటి సంఘటనలు వెలుగులోకి వచ్చే కొన్నే కానీ ప్రతి రోజూ సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయంలో కొల్లలు.

## పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 27 ఫిర్యాదులు

చిత్తూరుహెల్త్, జనవరి 5 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎస్పీ తుషార్ డూడి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి సమస్యలపై 27 అర్జీలు అందాయి. ఈ అర్జీలను పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడి క్షేత్ర స్థాయిలో సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జ్ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, డిటిసి డిఎస్పీ జె.రాంబాబులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ తగదాలకు సంబంధించి 6, భూ సమస్యలు 6, ఆర్థిక లావాదేవిలు 6, ఇంటి తగాదాలు 4, దారి సమస్యలు 2, ఆస్తి తగాదాలు 2, వేధింపులపై ఒక సమస్య అందాయి.

## బంగారం కోసం మామను హత్య చేసిన అల్లుడు

పుంగనూరు రూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త

బంగారు నగలు తిరిగి ఇవ్వమని అడిగిన మామ శంకరప్ప(60)ను అల్లుడు వీర మోహన్ రెడ్డి (42) బండరాయితో కొట్టి హత్య చేసినట్లు సీఐ సుబ్బారాయుడు సోమవారం తెలిపారు వివరాల ప్రకారం ఏడాది క్రితం శంకరప్ప భార్య మృతి చెందడంతో, ఆమెకు సంబంధించిన బంగారు నగలను తన కూతురికి ఇచ్చాడు. ఇటీవల భార్య సంవత్సర కర్మలు సంవత్సరీకం నిర్వహించేందుకు ఆ నగలను తిరిగి ఇవ్వమని అల్లుడిని శంకరప్ప కోరాడు. అయితే నగలు ఇవ్వడానికి అంగీకరించని అల్లుడు, మామ మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఆగ్రహంతో వీర మోహన్ రెడ్డి శంకరప్పపై బండరాయితో దాడి చేయగా, తీవ్ర గాయాలతో శంకరప్ప మృతి చెందినట్లు సమాచారం. అనంతరం ఈ ఘటనను బయటకు రాకుండా గుట్టుచప్పుడు కాకుండా అంతిమ క్రియలు నిర్వహించేందుకు అల్లుడు ప్రయత్నించినట్లు తెలిసింది. ఈ ఘటనపై అనుమానం కలిగిన మృతుడి కోడలు రమ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు వీర మోహన్ రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

## పోలీసుల నిర్లక్ష్యం..రోగులకు తప్పని తిప్పలు



సత్యవేడు, జనవరి 5 ప్రభాతవార్త: సత్యవేడు కమ్యూనిటీ ప్రభుత్వాస్పత్రి మార్గంలో పరిశ్రమలకు వెళ్లే ద్విచక్రవాహనదారులు ఇరుక్కు మార్గానికి అడ్డంగా వాహనాలు పార్కింగ్ చేస్తూ ఉండడంతో 104-108 ఎమర్జెన్సీ వాహనాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని స్థానికులు గగోలు పెడుతున్నారు. ఇచ్చట వాహనాలు నిలపరాదని పోలీసు వారు హెచ్చరిక బోర్డులు పెట్టినా ఆ హెచ్చరికను కూడా లెక్క చేయకుండా ఆ మార్గానికి అడ్డంగా ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేస్తూ ఉండడంతో అత్యవసరం 108 వాహనానికి తరచూ అంతరాయం కలుగుతున్నదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తద్వారా అత్యవసర వాహనానికి అంతరాయం కలిగిస్తున్న ఈ ద్విచక్రవాహనదారులపై పోలీసులు నిర్లక్ష్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆస్పత్రికి వస్తున్నటువంటి వందలాది మంది రోగులు, డాక్టర్లు, స్టాఫ్ నర్సులు ఆస్పత్రి సిబ్బంది డిమాండ్‌చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రికి వెళ్లే మార్గంలో ఇరువైపులా ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారని దానిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలంటూ పలుమార్లు పోలీసులకి విన్నవించినా ఇప్పటి వరకు ఆ ద్విచక్రవాహన దారులపై కఠినమైన చర్యలు తీసుకోకుండా పోలీసు వారు చోద్యం చూస్తున్నారంటూ ఆస్పత్రికి వస్తున్న వందలాది మంది రోగులు ఆస్పత్రి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరైతే 108 వాహనానికి అంతరాయం కలిగిస్తూ ఉండడం వల్ల ఏదైనా ప్రాణపాయం జరిగితే కాని పోలీసు వారు స్పందించరేమో అన్న విధంగా గట్టిగానే విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎస్ఐ చొరవ చూపి వాహనదారులు అక్కడ పార్కింగ్ చేయకుండా భారీ జరిమానా విధించి పోలీసు శాఖ పరంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్రద్ధాంజలి



శ్రీ రావిళ్ళ కాంతమ్మ గారు

మా తల్లిగారైన రావిళ్ళ కాంతమ్మ గారు
తేది : 05-01-2026 సోమవారం మధ్యాహ్నం
గం12.40ని॥లకు పరమపదించారు.
వీరి అంత్యక్రియలు 06-01-2026వ తేది మంగళవారం
ఉదయం గం 10.30ని॥లకు శ్రీకాళహస్తి పి.వి.రోడ్డు, బత్తెయ్యనాయుడు
హాస్పిటల్ ప్రక్కన గల మా స్వగృహము నుండి నిర్వహించబడును.
కావున తెలియజేయడమైనది. వీరి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని
ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

కుమారుడు : రావిళ్ళ మునిరాజ నాయుడు
కోడలు : రావిళ్ళ భవాని
మనుమరాళ్ళు : రావిళ్ళ రోషిణి, రావిళ్ళ పవిత్ర
శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా

## హెల్మెట్‌ధారణతోనే సురక్షిత గమ్యస్థానం



**చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహన దారుల హెల్మెట్ ధరించి ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ లక్ష్మీనా రాయణ అన్నారు. చిత్తూరు గాంధీ సర్కిల్ కూడలిలో సోమవారం ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ లక్ష్మీనారా యణ ఆధ్వ ర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ, ఇతర ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అత్యధికులు తల గాయపడటంతోనే మృతి చెందుతున్నారన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేయడం చట్టబద్దమైన బాధ్యత మాత్రమే కాదని కుటుంబ భద్రతకు సంబంధించిన విషయమన్నారు. మద్యం సేవించి వాహనలు నడుపరాదన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పక్కాగా గమ్యస్థానాలు చేరుకోవాలన్నారు.

## విబిజి రాంజీ పథకం సద్వినియోగం

**పెనుమూరు, జనవరి 5 ప్రభాతవార్త:**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను ప్రస్తుతం విబిజి రాంజీగా మార్పు చేశారని, ఈ పథకంను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని కెసిపల్లి, సాతంబాకం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గ్రామసభల్లో ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రస్తుతం వంద రోజులు వున్న ఉపాధి పనులను 125 రోజులకు పెంచడం జరిగిందన్నారు. కూలీలు పనిచేసిన దినాలకు సకాలంలో డబ్బులు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రుద్రయ్యానాయుడు, ఎపిఓ గుణశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బెస్త సంక్షేమ డైరెక్టర్‌గా అమరావతి

**బంగారుపాళ్యం, జనవరి 5 ప్రభాతవార్త:**



రాష్ట్ర బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పి.అమరావతమ్మ సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు. మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ ఆండారెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్, సీనియర్ టిడిపి నాయకురాలు అమరావతిని రాష్ట్ర బెస్త సంక్షే మ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు విజయవాడ నగరం గొల్లపూడి బీసీ సంక్షేమ భవనంలో రాష్ట్ర మంత్రి సవిత సమక్షంలో డైరెక్టర్‌గా ఆమె పదవి బాధ్యతలు చేపట్టారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, సీనియర్ టిడిపి నాయకులు ఎన్పి జయప్రకాష్, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్పి ధరణి, జనార్ధర్‌గౌడు, తగ్గువారిపల్లి ఉప సర్పంచ్ లోకనాధనాయుడు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమరావతమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తనకు రాష్ట్ర స్థాయిలో గుర్తించి ఇచ్చిందని, బెస్త కులస్తుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

## అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**- కడ పి.డి.వికాస్ మర్మత్**



**కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 30,31న కుప్పం లో పర్యటించే అవకాశం ఉందని, ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికార యంత్రాంగం ప్రతిపా దనలు సిద్ధం చేయాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో ఆయన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం చేపట్టారు. ప్రజలనుంచి వినతులను నేరుగా స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి ప్రసంగించారు. కుప్పంనుంచి ప్రజలు విజయవాడకు వెళ్లి ముఖ్యమంత్రి వద్ద సమస్యలు ప్రస్తావిస్తున్నారని ఈవిషయంగా అధికారులు ఆలోచించాలన్నారు. సమస్యలను ఎందుకు పరిష్కారం చేయలేకపోతున్నామనే విషయం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కుప్పం పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల వినతులపైతప్పక సమీక్ష జరుపుతారని ఇందులో సందేహం లేదన్నారు. ఆ సమయంలో అధికారులు సరైన సమాధానం చెప్పకుంటే తానేమీ చేయలేనని పేర్కొన్నారు. రెస్కో, పంచాయతీరాజ్ శాఖలు త్వరగా సమస్యలు పరిష్కరించాలన్నారు. కుప్పంలో రాయితీతో అందిస్తున్న ఇ – సైకిళ్లను డిఆర్‌డిఎ శాఖ ప్రమోట్ చేయాలని అలాగే పలు ప్రభుత్వ శాఖలు కనీసంవంద సైకిళ్లు అయినా కొనుగోలు చేయించేలా ప్రయత్నాలు చేయాలనిసూచించారు. ప్యాలస్‌రోడ్‌లో పట్టుశాఖ కార్యాలయం వద్ద ప్రహరీగోడ తొలగించి రోడ్డు ప్రమాదాలు నివారించాలని కౌన్సిలర్ జిమ్‌దాము కడ పి.డి.కివినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శివయ్య, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు, డిఇ ప్రభాకర్, ఎఫ్ఆర్వో జయశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని రైతుల వినతి

**కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త**



శాంతిపురం, రామకుప్పం మండలాల్లో నిర్మించే ఎయి ర్‌పోర్ట్‌కు తాము స ంతోష ంగా భూములు ఇచ్చామని తమకు ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు కేటాయిం చాలని సోమవారం శాంతిపురం మండలం దండి కుప్పం సమీపంలోని పాళ్యంగట్టు గ్రామస్తులు కడ పి.డి.వికాస్ మర్మత్‌ను కోరారు. గ్రామంలో తాము సుమారు ఇరవై కుటుంబాల దాకా ఉంటున్నామని తాము ఎయిర్‌పోర్టు నిర్మాణంకు భూములు సంతృప్తిగానే ఇచ్చామన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో తాము ఇళ్లు కోల్పోతామని తమకు ప్రత్యామ్నాయంగా ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. దీనిపై పి.డి. స్పందించి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులతో చర్చించి తప్పక రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుతిరిగారు.

## రైతుకష్టం తెలిసిన రైతుబిడ్డ సిఎం చంద్రబాబు

**- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్**

**కుప్పం,జనవరి 5 ప్రభాతవార్త**



రైతుల కష్టం తెలిసిన రైతుబిడ్డ సిఎం చంద్రబాబునాయుడు అని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కెడిపల్లిలో తహశీల్దార్ చిట్టిబాబు అధ్వర్యంలో జరిగిన రెవెన్యూ గ్రామసభలో రైతులకు నూతనంగా ప్రభుత్వంమంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా డా॥ శ్రీకాంత్ మాట్లాడుతూ రైతుల పాసు పుస్తకాలపై తన తండ్రి ఆస్తిలాతన ఫోటోలను పెట్టుకున్న ఘనత మాజీ సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రీసర్వే పేరిట రైతుల భూముల వివరాలు తప్పుల తడకగా చేసి రైతులను ఇబ్బందులపాలు చేశారన్నారు. చివరకు స్మశానాల రాళ్లకు సైతం ఫోటోలు పెట్టించుకున్నారని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు రైతులకు న్యాయం చేయాలనే ఆశయంతో మరలా గ్రామాల్లో రీసర్వే చేసి అసలైన ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పాసు పుస్తకాలు అందిస్తున్నారన్నారు. రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కనీసవేతనాల బోర్డు సభ్యుడు శరవణ, సర్పంచ్ సరస్వతి, కడ సభ్యుడు రామచంద్ర, నేతలు మహేం ద్ర, ఇఆర్‌బి బాలాజీ పాల్గొన్నారు.

ఫోటో రైటప్ :

## ఎంపిడిఓచే అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

**శాంతిపురం, జనవరి 5 ప్రభాతవార్త**



మండలంలోని 121 పెద్దూరు గ్రామంలో ఎంపిడిఓ ఎ ఆర్ కుమార్ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడ అందించే పౌష్టికాహారం గురిం చి లబ్దిదారులతో మాట్లాడారు. అనంతరం వికసిత్ భారత్ జిరామ్‌జీ గ్రామసభలో పాల్గొన్నారు. పథకం అమలు, పనిదినాల పెంపు, నిరుద్యోగ భృతిపై వివరించారు. అనంతరం రాయితీ ఇ –సైకిళ్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రీన్‌అంబాసిడర్లకు నెలకు పదివేల వేతనం ఈనెలనుంచి చెల్లిస్తామన్నారు.

## యువతకు ఉద్యోగంతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యం

**రామకుప్పం,జనవరి 5 ప్రభాతవార్త**



సమాజంలో యువతకు మెరుగైన ఉద్యోగాల కల్పనతోనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బందార్లపల్లి స్కిల్ డెవలప్మెంట్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చదువుకున్న విద్యార్థులకు పి ఫోర్ ద్వారా శిక్షణ తరగతులు ఇచ్చి ఇతర ప్రాంతాలకు ఉద్యోగ అవకాశాలకు అవకాశం కల్పిస్తారన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో మండలంలో ఏడు పరిశ్రమలు స్థాపించి వాటిలో ఉద్యోగ అవకాశాలకు సమచితస్థానం కల్పిస్తారు అన్నారు. దీంతో నిరుద్యోగ యువత ఈ అవకాశాలు అన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు శాంతారాం, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి రామరాజు నాయక్, నేతలు గుర్రప్ప, వెంకట్రామ గౌడు, రవి రెడ్డి, విశ్వనాథ్, రఘు, పెరుమాళ్, అవినాష్ రెడ్డి, శంకరాచలం, ఆదిల్, అల్లి శీన,మంజునాథ్ ,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## వికసిత పంచాయితీలే లక్ష్యం

**మండల తెదేపా అధ్యక్షులు మోహన్ మురళి**

**వెదురుకుప్పం, జనవరి 5 ప్రభాతవార్త :**



వికసిత్ భారత్, జీ రామ్ జీ పథకాలతో పంచాయితీ సమగ్ర అభివృద్ధి వికసిత్ పంచాయితీ లక్ష్యం నెరవేరు తుందని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెదురుకుప్పం పంచాయితీ సచివాయలంలో సోమవారం సర్పంచ్ శిల్పా ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలు అభివృద్ధి పథంలో నడవడంకు గ్రామసభ తీర్మాణాలు చక్కగా ఉపయోగపడుతాయన్నారు. పంచాయితీ పరిధిలోని వనరులు, అవసరాలు, నిధిలు బేరిజు వేసుకుని చేపట్టవలసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టవచ్చున్నారు. పంచాయితీని చెత్తరహిత పంచాయితీగా ప్రకటించడంతో పాటు 25 అంశాలతో కూడిన అజెండా అంశాలను సభలో చర్చించారు. అనంతరం ప్రధాన అంశాల పై తీర్మాణాలు తీసుకున్నారు.ఎంపిడివో పురుషోత్తం, పంచాయితీ కార్యదర్శి కోదండ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, విఆర్‌వో నరసింహ రెడ్డి,సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరిమాని గంగమ్మకు వెండి కవచం విరాళం

**శ్రీరంగరాజపురం, జనవరి 5 ప్రభాతవార్త:**



ఎస్ఆర్ పురం మండలం ఆరిమాకులపల్లె గ్రామంలో వెలసిన అరిమాని గంగమ్మ అమ్మవారికి కార్వేటినగరం మండలం ఆళత్తూరు గ్రామానికి చెందిన భక్తులు అనంత కృష్ణమనాయుడు, అనంత రాజమ్మ, వారి కుమారులు అనంత రవి, వారి సోదరులు 4 కేజీల వెండి విరాళంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ వై.లింగారెడ్డి, కార్యనిర్వాహక అధికారి టి.వెంకట్రాయులు, ప్రధాన అర్చకులువెంకటాచలపతి,పాలకమండలిసభ్యులు కె.మునికృష్ణ, సిబ్బంది ప్రకాష్, మోహన్ పాల్గొన్నారు.

## మాట తప్పడం ... మీ ప్రభుత్వంకు అలవాటే

**- వైకాపా నియోజకవర్గం వైద్య విభాగ అధ్యక్షులు కోలార్ ప్రకాష్**

**వెదురుకుప్పం, జనవరి 5 ప్రభాతవార్త :**



మాట తప్పడం మీ ప్రభుత్వంకు అలవాటే .... చంద్రబాబు మాటలెప్పుడు నీటి మూటలే అని మరోసారి రుజువు చేశారని వైకాపా నియోజకవర్గం వైద్య విభాగ అధ్యక్షులు డాక్టర్ కోలార్ ప్రకాష్ విమర్శలు చేశారు. మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచి ప్రభుత్వం అని మీకు మీరు చెప్పడం కాదని ప్రజలు చెప్పాలన్నారు. వెదురుకుప్పం, కార్వేటినగరం తుడపరిధిలోకి తీసుకువచ్చిన ఘనత వైకాపా ప్రభుత్వానిదే అని మాట చెప్పడం మాట తప్పడం మా అధినేత జగన్మోహన్‌రెడ్డికి, మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామిలకు తెలియదన్నారు. యువగళం పాదయాత్రలలో వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్పించుతామని నారా లోకేష్‌మాట ఇవ్వడం వాస్తవం కాదా... అని ప్రశ్నించారు.

## చెత్తరహిత గ్రామ పంచాయతీగా అరగొండ

**తవణంపల్లి, జనవరి 5 ప్రభాతవార్త:**



చెత్త రహిత గ్రామ పంచాయతీగా అరగొండ గ్రామ పంచాయతీని తీర్చి దిద్దడానికి ప్రజలు సహకరిం చాలని సర్పంచ్ మల్లుదొరై, గ్రామ పంచాయతీ డెవల ప్‌మెంట్ ఆఫీసర్ సురేష్‌బాబులు పేర్కొన్నారు. సోమ వారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాల యంలో స్వచ్ఛ సంక్రాంతి–స్వచ్ఛ పంచాయతీ–2026 అనే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం చెత్త రహిత గ్రామ పంచాయతీ ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమంను అమలు చేస్తోందన్నారు. పంచాయతీ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా వుంచు కోవాలని, తడిచెత్త, పొడి చెత్తలను వేరు వేరుగా గ్రామ పంచాయతీ చెత్త వాహనలకు అందించాలని, ప్లాస్టిక్ వాడకంను నిషేధించాలని తద్వారా చెత్త, ప్లాస్టిక్ రహిత గ్రామంగా పంచాయతీని తీర్చిదిద్దడానికి గ్రామ ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. అలాగే పంచాయతీ పరిధిలో డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం వంటి సమస్యలు ఎక్కడైనా వుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంను వికసిత్ భారత్ జిరాంజీగా పేరు మార్చడంపై స్వాగతిస్తున్నట్లు సర్పంచ్ మల్లుదొరై ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఓ, వార్డు సభ్యులు, పంచాయతీ పరిధిలోని ప్రజలు పాల్గొన్నారు.

## హింసకు గురయ్యే మహిళలకు సఖి వన్‌స్టాప్ సెంటర్‌తో న్యాయం

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

**చిత్తూరుహెల్త్, జనవరి 5 ప్రభాతవార్త:**



సమాజంలో హింసకు గురవుతున్న మహిళలు సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చునని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్ వన్ స్టాప్ సెంటర్ వాహనంను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అపదలో వుండి హింసకు గురవుతున్న మహిళలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం సఖి వన్ స్టాప్ సెంటర్‌ను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిందన్నారు. అపదలో వున్న మహిళలు ఎవరైనా సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించవచ్చునన్నారు. మహిళలకు ఉమెన్ హెల్ప్‌లైన్ 181 ఉచితంగా వుంటుందని, సఖీ వన్ స్టాప్ సెంటర్‌లో మహిళలకు ఉచితంగా కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పోలీసు సహాయం, వైద్య సహాయం, షెల్టర్ ఇవ్వబడు తుందన్నారు. జిల్లాస్త్రీశిశుసంక్షేమశాఖపిడివెంకటేశ్వరీ,సిడిపిఓలు, సఖి వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ పరమహంస యోగానంద జన్మదిన వేడుకలు

**శాంతిపురం, జనవరి 5 ప్రభాతవార్త**



స్థానిక పరమహంస యోగానంద పాఠశాలలో గురువు శ్రీ యోగానంద జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయంపూటభజన, అన్నప్రసాదాలువితరణ చేశారు. ముఖ్యఅతిథులుగా నారాయణశెట్టి, చంద్రశేఖర్, గణపతి శాస్త్రి, కోదండప్ప, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, వైస్ ప్రిన్సిపాల్ పార్థీవులు హాజరయ్యారు. శ్రీ యోగా నంద ఇండియాలో జన్మించి విదేశాలకు వెళ్లి పాశ్చాత్యులకు క్రియా యోగా గొప్పతనం తెలిపిన మహనీ యుడు అనివక్తలుపేర్కొన్నారు. ఆయనబాటలో విద్యార్థులు నడిచి ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని సూచించారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : పిడి



**గంగాధర నెల్లూరు, జనవరి 5 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సచివాలయంలో సోమవారం స్వచ్ఛ సంక్రాంతి గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎంఎంఎ పిడి ఎ.రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధి హామీ పేరు మార్పులపై అవగాహన కల్పించారు. అలాగే ఇది వరకు వంద రోజులు మాత్రమే పని దినాలు వుండేదని, కానీ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం 125 రోజులు పని దినాలుగా ప్రకటించిందన్నారు. అలాగే పథకం అవగాహన కోసం నిర్వహణ ఖర్చులలో నుంచి 2000 రూపాయల చొప్పున ఖర్చు చేయవచ్చునని గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మనోహర్ గౌడ్, సర్పంచ్ విసి సుబ్రమణ్యం యాదవ్, కార్యదర్శి శివయ్య, ఉపాధి సిబ్బంది, ఎస్ హెచ్‌జి మహిళలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**రొంపిచెర్ల, జనవరి 4, ప్రభాతవార్త:**



దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ చిత్తూరు జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఇర్షాద్ తెలిపారు. అదివారం రొంపిచెర్ల మండలంలో దివ్యాంగులకు సొంత ఖర్చులతో వినికిడి యంత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఎలాంటి సమస్యలు వచ్చిన తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇప్పటికే దివ్యాంగులకు వీల్ చైర్లు, వాకింగ్ స్టిక్స్, వాకర్లు, వినికిడి యంత్రాలను అందజేయడం జరిగిందన్నారు. ఇంకా ఎవరికైనా అవసరమైతే తమను సంప్రదించాలని కోరారు.పుంగనూరు నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షులు ఎస్.మహ మ్మదలీ, రొంపిచెర్ల మండల అధ్యక్షులు అబ్దుల్ రెహ్మాన్, పులిచెర్ల మండల అధ్యక్షులు రెడ్డి శేఖర్ నాయుడు ఉపాధ్యక్షులు రాజేష్, అడ్వైజర్ ఢిల్లీ బాబు, దివ్యాంగుల సంఘం నాయకులు మహ్మద్ అనీఫ్ పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై మండల రైతులకు శిక్షణ

**బైరెడ్డిపల్లి, జనవరి 5 ప్రభాతవార్త**



బైరెడ్డిపల్లి మండలంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. రాష్ట్రీయ కృషి వికాస్ 2025 26 యోజన లో భాగంగా పీఎం ఆర్ కె వి వై డిపిఆర్ జిల్లా వనరుల కేంద్రం ఏ డి ఏ వాసు రైతులకు ప్రకృతి వ్యవసాయం పైన శిక్షణ ఇవ్వడం జరిగింది. పంచాయితీ కేంద్రంలోని రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి శిక్షణ భాగంగా ఆయా పంచాయితీ రైతులను సమావేశపరిచి యాదృచ్చికంగా వ్యవసాయంలోని మెలకువలను తద్వారా కలిగే లాభాల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కార్యక్రమంను మండల వ్యవసాయ అధికారులు పర్యవేక్షించడం జరిగినది.

## రెవెన్యూ పాసు పుస్తకాల పంపిణీ



**బైరెడ్డిపల్లి జనవరి 5 ప్రభాతవార్త** బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని సచివాలయం నందు సోమ వారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రాజముద్రతో ఉన్నటువంటి రెవిన్యూ పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమానికి బైరెడ్డిపల్లి మండల తెలుగుదేశం అధ్యక్షులు కిషోర్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కిషోర్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని కల వాగ్దానాలలో భాగంగా చేసినటువంటి వాగ్దానాన్ని అమలు చేయడం జరిగిందన్నారు. రాజముద్రలు ముద్రించి పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారన్నారు. మండల తహసిల్దార్ ఎంఎస్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రి సర్వేలో జరిగినటువంటి లోటుపాట్లను సరిదిద్దే కార్యక్రమంలో భాగంగా సర్వేను నిర్వహించడం జరుగుతున్నదని.కొన్ని ప్రదేశాలలో తప్పులు దొర్లడం వాస్తవమేనని,దీన్ని గుర్తించి అన్ని విధాల చర్యలు తీసుకుని వారికి కూడా పాసుబుక్కులను జారీ చేయడం జరుగుతుందన్నారు. సింగల్ విండో అధ్యక్షుడు నాగరాజు నాయుడు మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం పాటుపడే పార్టీ ఏదైనా ఉందంటే అది తెలుగుదేశమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాల సాధనే లక్ష్యంగా

**రామకుప్పం,జనవరి 5 ప్రభాతవార్త**





మండలంలో బంగారు కుటుంబాలు సాధన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బంగారు కుటుంబాలు తో సమావేశమయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడు తూ మెగా ఇంజనీర్ సంస్థ ద్వారా మండలంలో 15 వందల కుటుంబాలను మొదట విడతగా ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహిస్తుందన్నారు. మండల శివారులలోని గురుకుల పాఠశాలలో త్వరలో సుమారు రెండు కోట్ల రూపాయలతో మౌలిక వసతుల కల్పన జరుగుతుందన్నారు. కుప్పం ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోట్ల రూపాయల నిధులతో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి కాంత్, టిటిడి బోర్డు సభ్యుడు శాంతారాం, టిడిపి మండల అధ్యక్ష ,మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి, కార్యదర్శి రామరాజు నాయక్, నేతలు సీతాపతి, గంట్లప్ప గౌడు, గుర్రప్ప, వెంకట్రామగౌడు,రవిరెడ్డి,విశ్వనాథ్,రామకృష్ణప్ప,రఘు,శంకరాచలం,అవినాష్ రెడ్డి, ఆదిల్, సురేష్, పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

**కుప్పం, జనవరి5 ప్రభాతవార్త**



మున్సిపల్ పరిధి సామగుట్టపల్లి జడ్పీ హైస్కూల్‌లో మాజీ హెచ్ఎం దీనదయాళ్ అధ్వర్యంలో సోమవారం ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సావిత్రిబాయిపూలే చేసిన సేవలను ఉపాధ్యాయులు హిమజకుమారి, రోజా రమణి వివరించారు. అనంతరంమహిళా ఉపాధ్యాయులనుఘనంగా సత్కరించారు. కార్య క్రమంలో గాలి సురేష్, సాయి గిరీష్, కిరణ్, గాయత్రిదేవి, విజయనిర్మల,శాంత, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు.. బాలికలకు గోదాదేవి ఫ్యాన్సీడ్రెస్ పోటీలు

**కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త**

కుప్పం పరిధిలో ఉన్న మహిళలు,బాలికలకు ధనుర్మాసం సందర్భంగా వికాస తరంగిణి అధ్వర్యంలో గోదాదేవి ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తిగల వారు ఈనెల 8వతేది వరకు గూగుల్‌ఫామ్‌లో తమ వివరాలు అందించాలని కోరారు. ఈపోటీలు ఈనెల 11న కుప్పంలోని సుజ్ఞానందనిర్వహిస్తామన్నారు.వివరాలకు9676124756,9963986620నెంబర్లనుసంప్రదించాలనికోరార

## ఎస్టీయు డెయిరీ..కేలండర్ల ఆవిష్కరణ

**శాంతిపురం, జనవరి 5 ప్రభాతవార్త**

ఎస్టీయు ఉపాధ్యాయ సంఘ నూతన సంవత్సర డెయిరీ, కేలండర్లను సోమవారం ఎంఇఒలు సెల్వ పాండియన్, చంద్రమ్మలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూమండలంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం హెచ్ఎం రాంబాబు, ఉపాధ్యాయులు ప్రభాకర్,సుబ్బమ్మలను సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాపతి, వీరభద్ర, డివిజన్ కన్వీనర్ రాధాకృష్ణ, సంఘ నేతలు చంద్రశేఖర్‌నాయుడు, రవి, అశోక్, ప్రభాకర్‌రెడ్డి, ఆనందప్ప, గోవిందప్ప, భార్గవాంజలి పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే సిఎం చంద్రబాబు లక్ష్యం - ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్

**శాంతిపురం, జనవరి 5 ప్రభాతవార్త** గ్రామాల అభి వృద్ధే సిఎం చంద్రబాబు,కూటమి ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వవిప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం పల్లెపండగ 2.0కార్యక్రమంలో భాగంగా ఆయన పోడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్‌ను ప్రారంభించారు. అనంతరం రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి రైతుకు భూభద్రత కల్పించడమే ప్రభుత్వ ఆశయమన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథనాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, నేతలు చంద్ర, రాజే ంద్ర, నాగరాజు, సుగుణమ్మ,అనసూయ, చంద్రకళ పాల్గొన్నారు.



## 33లక్షలతో నూతన సిసి రోడ్డు నిర్మాణం

**శాంతిపురం,జనవరి 5 ప్రభాతవార్త** మండలంలోని గుండిశెట్టిపల్లి పంచాయతీలో 33లక్షల నిధులతో నూతనంగా సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం పికెఎం ఉడా ఛైర్మన్‌డా॥బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అనసూయ, బాలు, గోపాల్, శేఖర్‌రెడ్డి, మంజునాథరెడ్డి, మునేగౌడు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## ఐక్యతగా ఉండి అన్నింటా రాణించాలి

**చిట్వేలి, జనవరి 5, ప్రభాతవార్త:**



వెనుకబడిన వర్గాలు ఐక్యతగా ఉండి అన్ని రంగాలలో రాణించాలని స్థానిక తహసిల్దార స్పందన రెడ్డి అన్నారు. సోమ వారం బ్రాహ్మణ వీధి, కేఎస్ అగ్రహారం, పాత చిట్వేలి గ్రామాలలో ఉండే అగ్నికుల క్షత్రియ,వన్నీ కుల క్షత్రియ, పల్లి రెడ్డి వర్గాలకు చెందిన సుమారు 1500 కుటుంబాల పల్లి కాపు సేవ సంఘము యువత ఆధ్వర్యంలో తయారు చేయబడిన యూనియన్ క్యాలెండర్ ను ఎమ్మార్వో ఆవిష్కరించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో ముందుండాలని వారికి సూచించారు. కార్యక్రమంలో సంబంధిత గ్రామ ప్రజలు,కోడూరు నియోజకవర్గం అధ్యక్షులు పోలూరు నరసింహ,స్థానిక మండల అధ్యక్షులు తోట వెంకటేష్, మహిళా అధ్యక్షులు అరవ ఆదిలక్ష్మి, ఉపాధ్యక్షులు తోట సునీల్, కొండా పురం గణేష్,హరి కోశాధికారి చెంజి రవీంద్ర రెడ్డి, సుబ్బా రెడ్డి,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ కేసును చేదించిన ఓబులవారిపల్లి పోలీసులు

**రైల్వేకోడూరు జనవరి 5 ప్రభాతవార్త**



రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం బొంతవారిపల్లె హరిజనవాడ సమీపంలో ఉన్న శేషారెడ్డి ఇంటిలో ఆయన భార్య విజయమ్మ, మరియు ఇందిరమ్మ అనే ఇద్దరు మహిళలు నిద్రిస్తున్న సమయంలో గత నెల 31 అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఇంటిముందు తాళాలు పగలగొట్టి దౌర్జన్యంగా ఇంటిలోనికి ప్రవేశించి నిద్రిస్తున్న ఇద్దరు మహిళలకి నోటికి ప్లాస్టర్లు అంటించి చేతులను గుడ్డలతో కట్టి వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను, నగలు నగదును దోచుకొని పరారైనట్లు రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సాంకేతిక ఆధారాలు మరియు నిఘా సమాచారంతో విచారణ జరిపి తుమ్మగుంట గ్రామానికి చెందిన దేరంగుల వంశీ, పుల్లగంటి గంగాధర్, పుల్లగంటి ప్రభాకర్ అనే ముగ్గురు ఈ నేరానికి పాల్పడినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రభాకర్ అనే యువకుడు పరారీలో ఉన్నాడని, అయితే సోమవారం బొమ్మ వరం క్రాసు వద్ద రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు, ఓబులవారిపల్లి ఎస్సై మహేష్ లు సిబ్బందితో నిందితులైన దేరంగుల వంశీ పుల్లగంటి గంగాధర్ లును పట్టుకొని అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి తెలిపారు, వీరి వద్ద నుండి ఎనిమిది లక్షల బంగారు 31,000 నగదు స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు పరారీ అయిన నిందితుడు ప్రభాకర్ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.రైల్వే కోడూరు ఎస్సై లక్ష్మి ప్రసాద్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్వీయూలో 8న జాబ్ మేళా

**తిరుపతి విద్య,జనవరి 5 ప్రభాత వార్త** ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈనెల 8వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఎమ్ఎన్సీ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాకు హాజరవుతారని, ఆసక్తిగల ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, ఐటీఐ, పలు ఫార్మశీ కోర్సులలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు.మరిన్నివివరాలకువర్సిటీలోనిఎంప్లాయిమెంట్కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## తొట్టంబేడు పంచాయతీలో స్వచ్ఛ సంక్రాంతి



**తొట్టంబేడు,జనవరి 5 ప్రభాతవార్త** తొట్టంబేడు పంచాయతీలో సర్పంచ్ సుబ్బయ్య అధ్వర్యంలో వికసిత్ భారత్,స్వచ్ఛ సంక్రాంతి గ్రామసభను నిర్వహించారు, ఎంపిడిఓ సురేంద్ర నాథ్ ఆదేశాలతో సర్పంచ్ సభను ఏర్పాటు చేసారు. ఇక్కడ సంక్రాంతికి సంబంధించి స్వామిత్వ పథకాల గురించి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ నేడు వాతావరణం మారటంతో రక రరాల ఆరోగ్య సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారు. పంచాయతీల్లో సర్పంచ్లు పారిశుద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంచినీటిని అందించాలని సూచించారు. అంతేకాక ఉపాధి కూలీలకు పని దినాలు గతంలో 100 ఉండేవని ప్రస్తుతం వీటిని 125రోజులకు పెంచామని ఎంపిడిఓ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఎంపిడిఓతో పాటు శ్రీకాళహస్తి డివిజన్ డిడిఓ సుస్మిత, సింగిల్ విండో అధ్యక్షులు భాస్కర్,ఏపిఓ కళ్యాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మారిషస్ ప్రధాని శివయ్య సన్నిధికి రాక

**శ్రీకాళహస్తి,జనవరి 5 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి మంగళవారం మధ్యాహ్నం మారిషస్ అధ్యక్షుడు ధరంబీర్ గోకుల్ కుటుంబ సభ్యులతో రానున్నట్లు సమాచారం అందింది.ఈ మేరకు ఏర్పాట్లును జిల్లా అధికారులు స్థానిక ఆర్డిఓ భానుప్రకాష్రెడ్డి, డివైయస్పి నరసింహామూర్తి ఆలయ ఇఓ డి.బాపిరెడ్డిలు కలసి ఆలయంలో ట్రైయల్రన్ నిర్వహించారు. ఆయన రాక సందర్బంగా గట్టి బందోబస్తును జిల్లా ఎస్పి సుబ్బరాయుడు పరిశీలిస్తున్నారు. ఆయన పర్యటన ఎలాంటి ఒడుదుడుకుల్లేకుండా సాగాలని గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.అలాగే రోడ్మ్యాప్ను పరిశీలించారు. మధ్యాహ్నం 11.45గంటకు ఆయన రేణిగుంట విమానాశ్రయానికి వస్తారు.అక్కడ నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని దర్శనా నికి రానున్నట్లు తెలిసింది.

## మండలాధ్యక్షునికి మాతృవియోగం:



**తొట్టంబేడు,జనవరి 5 ప్రభాతవార్త** తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ పాలసరఫరా సంఘం అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడుకు మాతృవియోగం కల్గింది. ఆయన మాతృమూర్తి రావిళ్ళ కాంతమ్మ సోమవారం తుది శ్వాస విడిచారు.ఆమె మృతికి పలువురు సంతాపాలు తెలిపారు. మండల నాయకులతో పాటు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్రెడ్డి,ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డి, బొజ్జల బృందమ్మలు హాజరై తమ సంతాపాలను తెలిపారు. మునిరాజా నాయుడును ఓదార్చారు. అలాగే తెలుగుదేశం నాయకులు చెంచయ్యనాయుడు, పేరం నాగరాజనా యుడు,కామేష్యాదవ్, కన్నలి ప్రతాప్రెడ్డి,మహిళా నాయకురాలు సుమతి, అనిత మండలంలోని అన్ని పంచాయతీల నుంచి తెలుగుదేశం క్యాడర్ హాజరయ్యారు.తమ సంతాపాలను తెలిపారు. అంత్యక్రియలు మధ్యాహ్నం జరుగుతాయని వివరించారు.

## గుడిమల్లం రోడ్డు ఏర్పాటుకు సిద్ధం

**ఏర్పేడు,జనవరి 5 ప్రభాతవార్త**



గుడిమల్లం ఆలయానికి వెళ్ళే రోడ్డు ఇరుక్కుగా ఉండటంతో రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల తాకిడి వాహనాల తాకిడితో రోడ్డును గ్రామంలో కొంత వెడల్పు చేయాలని నిర్ణయించారు.ఈ మేరకు సోమవారం మంచి రోజు కాబట్టి ఆలయ చైర్మెన్ బత్తల గిరానాయుడు గ్రామంలో పనులకు శ్రీకారం చేపట్టారు. రూ.37లక్షలతో గ్రామంలో ప్రధాన వీధులను విస్తరించి రోడ్డును నిర్మించుటకుచర్యలు తీసుకున్నారు.ఇక్కడ ఫుట్ పాత్ను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆధ్యాత్మికతకు నిలయమైన శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని గుడిమల్లం ఆలయం అభివృద్ధికి స్థానిక శాసనసభ్యుడు సుధీర్రెడ్డి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. ప్రధాన రోడ్డు నుంచి గ్రామంలో రోడ్డు ఇరుగ్గా ఉండటంతో ప్రత్యేక నిధులను ఎంఎల్ఏ ఎన్ఆర్జిఐస్ నిధులను మంజూరు చేయించారు.శివాలయం నుంచి 450 మీటర్లు ప్రధాన వీధుల విస్తరణ పనులు ప్రారంభించారు. గ్రామస్థుల సహాకారంతో ఫుట్ పాత్లను ఏర్పాటు చేయనున్నట్లు చైర్మెన్ వివరించారు.సుమారు 24 అడుగుల వెడల్పుతో పాటు డ్రైనేజ్ కాలువ దాని మీద ఫుట్ పాత్ను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులను ఆకట్టుకునే రితిలో ఆలయం చుట్టూ గ్రీనరి ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మెన్ బత్తల గిరినాయుడు వివరించారు.

## ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ మనుగడ



**శ్రీకాళహస్తి,జనవరి 5 ప్రభాతవార్త** ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవ మనుగడకు గుర్తింపు ఉందని న్యాయవాదులు తెలిపారు.సోమవారం 12వ అదనపు జిల్లా జడ్జి ఆదేశాల మేరకు పట్టణ నడిబొడ్డులోని విశ్వభారతి పాఠశాలలో మండల న్యాయసేవా అధికార సంస్థ సారధ్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారి సారధ్యంలో ర్యాలి నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో న్యాయవాదులు అరుణ్, వినోద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, పారా వాలంటీర్,కోర్టు సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వన్నెకుల క్షత్రియ సంఘం క్యాలండర్ ఆవిష్కరణ



**శ్రీకాళహస్తి,జనవరి 5 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గ నూతన సంవత్సర 2026ను సోమవారం ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆవిష్కరించారు. పానగల్లోని పొన్నాలమ్మగుడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వన్నెరెడ్డి సేవా సంక్షేమ సారధ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈస ందర్బంగా డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ కొత్త సంవత్సరం అందరికి బాగుండాలన్నారు. రైతులకు పంటలు బాగా పండాలని పిలుపునిచ్చారు. నేడు బిసిలకు ఎన్నో సదుపాయాలు అవకాశాలున్నా వాటిని కొందరు తన్నుకు పోతున్నారన్నారు. బిసిలు ఆర్థికంగా రాజకీయంగా బలపడాలంటే చదువుల్లో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర బిసి అధ్యక్షులు వడ్లతాంగళ్ బాలాజి ప్రసాద్రెడ్డి, వన్నెరెడ్డి పెద్దలు రత్నం రెడ్డి, బుజ్జిరెడ్డి, మేస్త్రీ పెరుమాళ్రెడ్డి, టౌన్బ్యాంకు మాజీ వైస్ చైర్మెన్ పుదూరు శరత్బాబుంరెడ్డి, దామోదర్రెడ్డి తిరుమల రెడ్డి, మధురెడ్డి, భరత్రెడ్డి, మునికృష్ణారెడ్డి, జవీకే రెడ్డి, సుధాకర్రెడ్డి, మునిరెడ్డి, దొరబాబు,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు పంపిణి

**ఏర్పేడు,జనవరి 5 ప్రభాతవార్త** ఏర్పేడు మండల కేంద్రంలో పని చేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం మండల పార్టీ కార్యాలయంలో సామగ్రిని అందజేసారు. ఈ సందర్బంగా ఏర్పేడులో గ్రామ సర్పంచ్ నల్లపాళెం శివయ్య సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు పంచాయతీ కార్యదర్శి అయ్యప్పరెడ్డిల సారధ్యంలో నిర్వహించారు.



పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన ఇతర సామగ్రిని అందించారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు కార్మికులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. వాటిని సద్దినియోగం చేసుకుంటూ పంచాయతీని పరిశుభ్రంగా ఉండాలని శివయ్య పిలుపునిచ్చారు.

## నాసా కిట్లను పంపిణి చేసిన నారాయణ పాఠశాల



**శ్రీకాళహస్తి,జనవరి 5 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన నాసా ప్రాజెక్టుకిట్లను సోమవారం శ్రీకాళహస్తిలోని నారాయణ పాఠశాలలో విద్యార్థులకు అందించారు.ఈ ప్రాజెక్టుకు 15 మంది విద్యార్థులు ఎంపికైన విషయం విదితమే. పాఠశాల ఎజిఎం శ్రీనివాసులు, పిఎల్ఆర్ఆసుపత్రి వైద్యులు డాక్టర్ లోకేష్ రెడ్డి పాల్గొని నాసాకిట్లను అందించారు.ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్య, ఆర్ఐ కిరణ్, కోఆర్టినేటర్ శ్రీకాంత్, డిన్ కేడర్ నాసా ఇన్చార్జి పావని, రాజేశ్వరి,ఎఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని మరింత పెంపొందిస్తుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## ప్రజలకు జీవనోపాధి కల్పించడమే వికసిత్ భారత్

**భాకరాపేట, జనవరి 5 ప్రభాతవార్త** ప్రజలకు ఉపాధి జీవనోపాధి కల్పించడమే వికసిత్ భారత్ జీ రామ్ జీ లక్ష్యమని ఎంపీడీవో గిద్దయ్య అన్నారు చిన్నగొట్టిగల్లు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో జి రామ్ జి గ్రామసభలు నిర్వహించారు పోస్టర్లను విడుదల చేశారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ భారతాన్ని సంక్షేమంపై ఆధారపడే స్థితి నుంచి వికసిత్ భారత్ 2047 పథకాన్ని రూపొందించడం జరిగిందన్నారు అందులో భాగంగా ఉపాధి హామీ పథకంలో మార్పులు చేస్తూ జి రామ్ జి పథకాన్ని తీసుకొచ్చారన్నారు ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 125 రోజులు వేతన హామీ కల్పిస్తుందన్నారు దీని ద్వారా ప్రజలకు ఆర్థిక భద్రత కలుగుతుందన్నారు ప్రజలు వలసలు పోకుండా నిరోధించవచ్చని గ్రామాలలో నీటి సంరక్షణ మౌలిక వసతులు కల్పనకు తోడ్పడుతుందన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ఇంచార్జ్ శివ కుమార్ బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కిషోర్ కుమార్ సర్పంచ్ మనోహర ఏపీవో భార్గవి కార్యదర్శి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు ఫోటో :..జి రామ్ జి పోస్టర్లను

## ఇంటి పట్టాలు ఇవ్వండి

**వడమాలపేట, జనవరి 5 ప్రభాతవార్త:**

దళిత గిరిజనులకు ఇంటి పట్టాలు, అనుభవంలో ఉన్న భూములకు డీకేటీ పట్టాలు ఇవ్వాలని దళిత సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య వడమాలపేట తహసీల్దార్ జరీనాకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో ఒక కుటుంబంలో రెండు, మూడు కాపురాలు ఉన్న వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని, ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నా భూములకు డీకేటీ పట్టాలు, పాసు పుస్తకాలు ఇవ్వాలని వడమాలపేట పీజీఆర్ఎస్లో వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ భూములు సర్వే చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తామని, అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇస్తామని, అదే విధంగా ఎస్సీ, ఎస్టీ కాలనీలో శ్మశానం ఏర్పాటు చేసి, దారి సౌకర్యం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మండల వ్యవసాయ కార్మికుల సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, కె.మణి, టి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులపై గ్రామసభ



**విజయపురం, జనవరి 5 ప్రభాతవార్త:** ఉపాధిహామీ పనులపై మండలంలోని బూచివానత్తం సోమవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 125 రోజులు పని దినాలు కల్పిస్తున్నట్లు ఏపీవో కవిత తెలిపారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని జ్యోతిరా వుపూలే జాతీయ గ్రామీణ ఉపాధి పథకంగా మార్పు చేశారని, ప్రతి ఒక్కరు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందిర, నాయకులు చెంచయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం స్వాధీనం, డ్రైవర్ అరెస్టు

**వడమాలపేట, జనవరి 5 ప్రభాతవార్త:**

తమిళనాడుకు అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎస్వీ పురం టోల్ ప్లాజా వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ హరీష్ తెలిపారు. సోమవారం టోల్ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా శ్రీకాళహస్తి నుంచి తమిళనాడులోని ఊత్తుకోటకు ఏపీ21, పీజెడ్ 7850 నెంబరు లారీలో రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా తనిఖీ చేసి స్వాధీనం చేసుకుని డ్రైవర్ సతీష్ అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో 20 టన్నులు కలిగిన 400 బస్తాల బియ్యాన్ని లారీతో పాటు స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరుకు చెందిన దశరథరామయ్యను విచారించనున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న 9 లక్షల విలువ కలిగిన బియ్యాన్ని తహసీల్దార్ జరీనా ఆధ్వర్యంలో సీఎస్ డీటీ హరి, పుత్తూరు సివిల్ సప్లయ్ గోడౌన్కు తరలించారు.

## కోసలనగరంలో ఆరోగ్య ఉప కేంద్ర పనులు ప్రారంభం



**విజయపురం, జనవరి 5 ప్రభాతవార్త:** మండలంలోని కోసలనగరంలో ఆరోగ్య ఉపకేంద్ర పనులు ప్రారంభమయ్యాయి. ఏఈ వీరభద్రం సూచన మేరకు పనులు జోరుగా జరుగుతున్నాయి. ఉప కేంద్ర నిర్మాణానికి పునాదులు తీసి కాంక్రీట్ పనులు ప్రారంభమ య్యాయి. పనులను సింగిల్విండో అధ్యక్షుడు బాబుయాదవ్, కాంట్రాక్టర్ బాలసుబ్రహ్మణ్యం రాజు, నాయకులు సుధాకర్రాజు పనులను పర్యవేక్షించారు.

## ఉపాధిహామీ పనులపై గ్రామసభ

**విజయపురం, జనవరి 5 ప్రభాతవార్త:**



ఉపాధిహామీ పనులపై మండలంలోని బూచివానత్తం సోమవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ లోచేపట్టాల్సి నపనులపైసమీక్షించారు.ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 125 రోజులు పని దినాలు కల్పిస్తున్నట్లు ఏపీవో కవిత తెలిపారు. మహా త్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని జ్యోతి రావుపూలే జాతీయ గ్రామీణ ఉపాధి పథకంగా మార్పు చేశారని, ప్రతి ఒక్కరు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సర్పంచ్ ఇందిర, నాయకులు చెంచయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లాలోని జలాశయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి.



**రేణిగుంట, జనవరి 5 ప్రభాతవార్త..** తిరుపతి జిల్లాలో ప్రతిష్టాత్మమైన మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్, మామండూరు రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న జలాశయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలనిబిజెపి యువనాయకులు వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేస్తూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు అర్జీ సమర్పించారు. తిరుపతి జిల్లాలోని జలాశయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి పరిస్తే జిల్లాలోని యువతకు ఉపాధి లభిస్తుందని వెంకటాద్రి యాదవ్ అన్నారు. జలాశయాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తే ఎన్నో వందల ఎకరాలకు పంట నీరు లభించడంతోపాటు రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.

## జామాయిల్ తోటలను నాశనం చేశారంటూ రైతు ఆవేదన....



**రేణిగుంట జనవరి 5 ప్రభాతవార్త** రేణిగుంట మండలం గుత్తివారిపల్లె గ్రామ పరిధిలో తన సొంత పొలంలో సాగు చేసుకుంటున్న జామాయిల్ చెట్లను కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా ధ్వంసం చేశారని రైతు శ్రావణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. జామాయిల్ తోటలో ట్రాక్టర్లు భారీ యంత్రాలు నడపడం వల్ల చెట్లు నాశనం అయ్యాయని కన్నీటి పర్యంతం అయ్యాడు. రేయి పగలు కష్టపడి పెంచుకున్న చెట్లు నాశనం కావడంతో రైతును ఓదార్చడం సాధ్యం కాలేదు. ఈ విషయమై రేణిగుంట పోలీసులకు, రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం కల్పించలేదని వాపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు..

## హోరాహోరీగా ఫుట్బాల్ మ్యాచ్...



**రేణిగుంట జనవరి 5 ప్రభాతవార్త** చిత్తూరు మై భారత్, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా బ్లాక్ లెవెల్ స్పోర్ట్ మీట్ నందు భాగంగా రేణిగుంట రైల్వే ఇన్స్టిట్యూట్లో సోమవారం వాలీబాల్ పోటీలు నిర్వహించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రేణిగుంట మేజర్ పంచాయతీ సర్పంచి నాగేశం పోటీలను ప్రారంభించారు. పోటీల్లో 8 టీములు పాల్గొన్నాయి. ఇండియన్ రైల్వే ఇన్స్టిట్యూట్ టీం, యంగ్ బ్రదర్స్ టీం ఫైనల్స్ కు చేరుకున్నాయి. చివరిగా జరిగిన పోటీలో రైల్వే ఇన్స్టిట్యూట్ టీం మ్యాచ్ను కైవసం చేసుకుంది. విన్నర్స్,రన్నర్స్ టీములకు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు, సర్పంచ్ నాగేశం, రెఫ్రీ మధుసూధన రావు బహుమతులు అందజేశారు.కుమార్, ఉషా కుమార్, రాజేందర్, జయరాజు, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించండి...

**రేణిగుంట జనవరి 5 ప్రభాతవార్త** రేణిగుంట మేజర్ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులకు రెండు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికులు ఏఐటీయూసీ నేతృత్వంలో సోమవారం సర్పంచ్ నాగేశం, కార్యదర్శి రమేష్ బాబు కు వినతి పత్రం సమర్పించారు. గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ అన్నారు. ఇంటి అద్దెలు కరెంటు బిల్లులు కట్టుకోలేక కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్లో ఉన్న అరియర్స్ తక్షణం ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికురికి 18, 000 రూపాయలు జీవో ప్రకారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ మండల కార్యదర్శి వైయస్ మణి, రేణిగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విఆర్ రవాణన్, చంద్రకళ, సుబ్బరాజు, రమణ తదితరులు ఉన్నారు.

## స్కేటింగ్లో భాష్యం విద్యార్థి ప్రతిభ

**తిరుపతి విద్య,జనవరి 5 ప్రభాత వార్త**



స్థానిక శ్రీపురం కాలనీ కేటీ రోడ్డులోని భాష్యం పాఠశాలలో 8వతరగతి చదువుతున్న విద్యార్థిని కే ఖ్యాతి తన అసమాన ప్రతిభతో జాతీయ,రాష్ట్ర, జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలలో బంగారు, కాంస్య పతకాలను సాధించింది. స్కూల్ గేమ్స్ పెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల మధ్యప్రదేశ్ గ్వాలియర్ లో జరిగిన 1000 మీటర్ల స్కేటింగ్ రేస్లో కాంస్య పతకాన్ని సాధించింది. అలాగే రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఖిగత ఏడాది డిసెంబర్ లో వైజాగ్ వేదికగా జరిగిన రాడ్ రేస్ పోటీలల్లో బంగారు పతకంతో పాటు కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా సోమవారం బాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ, రాయలసీమ జోన్ 2 జెడ్ఈ ఓ ఎల్ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు.

## అనంత లా కాలేజ్ ప్రిన్సిపాల్కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



**తిరుపతి విద్య,జనవరి 5 ప్రభాత వార్త** స్థానిక అనంత లా కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిరి కుమార్ కు సోమవారం పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలి పారు. ఇందులో భాగంగా భారతీయ దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు .యుగంధర్ మాదిగ, రాష్ట్ర సెక్రటరీ జేడీ ప్రసాద్, ఏపీ మాల విద్యార్థి సంఘం సుకు మార్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని పుష్ప గుచ్ఛం అందించి ఘనంగా సన్మానించి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఎంతో మంది పేద విద్యార్థులను న్యాయవాదులుగా, న్యాయమూర్తులుగా తీర్చిద్దిన ఘనత ఆయన సొంతమన్నారు. విద్యాప్రదాతగా భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షి ంచారు.

# తిరుపతి డివిజన్

## గ్రామాల సమగ్ర అభివృద్ధికి వికసిత్ భారత్ -జి రామ్ జి 2025 పథకం



**-125 రోజులకు ఉపాధి హామీ పనులు పెంపు**

**తిరుపతిరూరల్, జనవరి05 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం వికసిత్ భారత్ -జి రామ్ జి-2025 పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని పెరుమాళ్ళపల్లి పంచాయతీ కార్యదర్శి జానకిరామ్ తెలిపారు. సోమవారం తిరుపతిరూరల్ మండలంలోని గ్రామ పంచాయతీలలో ఉపాధిహామి పథకంపై గ్రామసభ నిర్వహించారు. విబి-జి ఆర్ఏఎం జి- పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రధాన ఉద్దేశ్యంగా పెట్టుకుంది. ఈ పథకంలో భాగంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, సిసి రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థలు, త్రాగునీటి సౌకర్యాలు, కాల్వల మరమ్మత్తులు, పచ్చదనం పెంపు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద 125రోజుల పనికి హామీ ఇస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

## వినాయకసాగర్ సమస్యలను పరిష్కరించండి

**తిరుపతిరూరల్, జనవరి 5 ప్రభాతవార్త:**



తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి వినాయకనగర్ గ్రామంలో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అర్బన్ తహశీల్థార్ సురేష్బాబుకు టిడిపి నాయకులు షంషేర్ సయ్యద్ వినతిపత్రం అందజేసారు. ఈ సందర్బంగా షంషేర్ సయ్యద్ మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాలుగా పేదలు నివసించే వినాయక సాగర్లో సమస్యలు తిష్టవేసి ఉన్నాయని, ముఖ్యంగా రహదారి సమస్యతో పాటు త్రాగునీటి సౌకర్యం లేదని వాపోయారు. వినాయక సాగర్ మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆ కార్యక్రమంలో కాలనీవాసులు అమ్ములు, శంకర్, వెంకటేష్రెడి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు అభివృద్ధి ఊపిరి

**-పేరూరు గ్రామ పంచాయతీలో రూ.70లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం**

**-శిలాఫలకాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే పులివర్తి నాని**



**తిరుపతిరూరల్, జనవరి 5 ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వ పాలనలో చంద్రగిరి నియోజకవర్గంలోని పంచాయతీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని చంద్ర గిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విమర్శించారు. పంచా యతీ నిధులను ప్రజల అభివృద్ధికి కాకుండా స్వలాభానికి వినియోగించిన ఘనత పాలకులదేనని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. పంచాయతీల్లో అభివృద్ధి పరుగులు మొదలయ్యాయని స్పష్టం చేశారు. దీర్ఘకాలికంగా పేరుకు పోయిన ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుం టున్నామని ఎమ్మెల్యే నాని తెలిపారు.పేరూరు గ్రామ పంచాయతీలో స్మశాన స్థలం ఆక్రమణకు గురి కాకుండా ప్రహరి ఏర్పాటుకు సహకారం అందించాలని పలుమార్లు టిడిపి నేత నాగూరు శ్రీనివాసులు దృష్టి తీసుకువచ్చారని, శ్రీనివాసులు కృషితోనే ప్రహరి గోడ ఏర్పాటు జరిగిందని తెలిపారు. పేరూరు గ్రామ పంచాయతీలో రూ.70లక్షల నిధులతో అభివృద్ధి చేసిన పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.50లక్షల రుపాయల నిధులతో ఏర్పాటు చేసిన స్మశాన ప్రహారి గోడకు శిలాఫలకం ఆవిష్కరించారు. అలాగే నూతన వాటర్ప్లాంట్, మహిళా భవనాన్ని ప్రారంభించారు.

***త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం*** ఎన్టీఆర్ కాలనీలో ప్రజలు ఎన్నేళ్లుగా ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యను సత్వరం పరిష్కరించాలనే దృఢ సంకల్పంతో నూతన వాటర్ ప్లాంట్ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్రెడ్డి, జడ్పిటిసి రత్నమ్మ, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, మల్లంగుంట సింగిల్ విండో చైర్మెన్ మధుశేఖర్, టిడిపి యువ నాయకులు కాయం వెంకటేష్, మహేష్, జగదీష్రెడ్డి,జ్ఞానేశ్వర్రెడ్డి, మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యవేడు నియోజకవర్గ సమస్యలను పరిస్కరించండి

**నారాయణవనం, జనవరి 5 ప్రభాతవార్త :**

సత్యవేడు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పరిస్కారానికి నోచుకొని పలు సమస్యలపై దృష్టి సారించి పరిస్కరించడానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వేంకటేశ్వర్కి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వినతిపత్రంఅందించారు.అనంతరంజిల్లాఎస్పీసుబ్బరాయుడు,విద్యుత్శాఖసిఎండిశివ శంకర్లను వారివారికార్యాలయాల్లోకలిసిసత్కరించారు.కొత్తసంవత్సర, ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## కైలాసకోన హుండీ ఆదాయం 1.88లక్షలు



**నారాయణవనం, జనవరి 5 ప్రభాతవార్త :** మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ కైలాసకోనలో ప్రసిద్ది చెందిన కామాక్షాంభిగా సమేత కైలాసనాధుని హుండీ ఆదాయం సోమవారం ఉదయం 10గంటలకు లెక్కించారు. ఈ హుండీ లెక్కింపు ద్వారా దేవస్థానంకు 1,88,662 రూపాయాల ఆదాయం వచ్చినట్టు ఆలయ చైర్మన్ నర్రావుల బాలచంద్రనాయుడు, ఇఓ ఎం కృష్ణానాయక్లు తెలిపారు. ఈ ఆదాయా న్ని బ్యాంకు అకౌంట్లో జమ చేస్తామన్నారు. అర్చకులు, పాలకమండలి సభ్యులు, స్థానిక పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉపాధి హామి పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

**నారాయణవనం, జనవరి 5 ప్రభాతవార్త :**



మహాత్మగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామి పథ కంను యధావిధిగా కొనసాగించాలని రాష్ట్ర వ్యవసా య కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి మహేష్ సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టంతో తీసుకొచ్చిన వికసిత్ భారత్ జి రామ్ జి పథకంను రద్దు చేసి పాత పథకంతోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 10వతేది కర్నూల్లోని జడ్పీ హాల్లో రాష్ట్రస్థాయి సదస్సును కూడా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మండల కార్యదర్శి సిద్దంశెట్టి చంద్రబాబు, వ్యవసాయ కూలీలు నాగులమ్మ, కురుబ, మునెమ్మ, శ్రీరాములు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సూపర్వైజర్పై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు

**పుత్తూరు రూరల్, జనవరి 5 ప్రభాతవార్త:**



పుత్తూరు ఆర్టీసీ డిపోలో గత 20 సంవత్స రాలు గాపని చేస్తున్న పారిశుధ్య కార్మికులు నుంచి జీతాలు పీఎఫ్ డబ్బులు మోసం చేసిన సూపర్ వైజర్ పైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ పుత్తూరు మండల కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ పుత్తూరు మండల కార్యదర్శి చంద్రబాబులు మాట్లాడుతూ పుత్తూరు ఆర్టీసీ డిపోలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న పి.నాగులమ్మ, ఏ.కిరుబాబ, బి.మునెమ్మ, కార్మికులు గతంలో 32 సంవత్సరాలు 20 సంవత్సరాలు, 15 సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వారికి కాంట్రాక్టర్ 12,500 రూపాయలు జీతం చెల్లిస్తున్న సూ పర్వైజర్ 6 వేలు మాత్రమే చెల్లించి వాళ్ల వద్ద వెట్టిచాకిరి చేపించుకున్నారు. కార్మికుల యొక్క అకౌంట్కి సూపర్వైజర్ యొక్క ఫోన్నెంబరు లింక్ చేసుకుని పీఎఫ్ అకౌంట్ కూడా అతని నెంబరు లింక్ చేసుకుని వాళ్ళకు వస్తున్న జీతాలు డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తున్న పీఎఫ్ డబ్బులను కూడా ఆయన జేబులో వేసుకున్నారని ఆరోపించారు. మా సంతకాలను ఫోర్జరీ చేసి మా డబ్బులు కాజేసిన కాంట్రాక్టు సూపర్వైజర్పైచర్యలతీసుకోవాలని కోరారు.పి.నాగులమ్మ, బి.మునెమ్మ, ఏ.కరుబ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

**చంద్రగిరి, జనవరి 5 ప్రభాతవార్త:**



చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఈఓ కె.మమత మాట్లాడుతూ భక్తుల ద్వారా లభించిన హుండీ కానుకలను దేవాదాయ ధర్మాదాయ శాఖ తిరుపతి డివిజన్, తనిఖీదారు పి.ఫణిరాజశయన సమక్షంలో లెక్కించినట్లు వెళ్ళడించారు. ఇందులో నగదు రూపేణా రూ.5,82,679/-లు ఆదాయం లభించినట్లు వెళ్ళడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, సభ్యులు వెంకటముని, భారతి, యోగానందం, మునిక్రిష్ణమ నాయుడు, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నాయుడుపేట, జనవరి 5 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీ పోలేరమ్మ ఆలయంలో సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయానికి విచ్చేసిన పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, భీమవరం సర్పంచ్ నెలవల అమృత సరళ లకు ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు పూర్ణకుంభంతో స్వాగతం పలికా స్వాగతం పలికారు. అనంతరం వారికి శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఆలయ పూజావారిలు అమ్మవారికి పూజలు చేసి టీడీపీ జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీలతో పాటు స్థానిక కూటమి పార్టీ నాయకులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్, తెలుగుదేశం పార్టీ నాయకులు పార్థసారథి, కట్టా వెంకటరమణారెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పోట్ల పూడి రాజేష్, ఓజిలి మండల టిడిపి అధ్యక్షులు జి.విజయకుమార్ నాయుడు, నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మైలారి శోభారాణి, కురుగొండ పిఎసిఎస్ చైర్ పర్సన్ డాక్టర్ దారా అంకయ్య, కందల కృష్ణారెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు మైలారి రాజశేఖర్, పసల గంగాప్రసాద్, వేలూరు మురళీకృష్ణా రెడ్డి, అవధానం సుధీర్, గూడూరు సుధీర్ రెడ్డి, కాపులూరు చక్రపాణి, జి.వి.ఆర్ నాయుడు, జువ్వలపాటి మస్తాన్, శిరసనం బేటి చైతన్య కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు, బిరదవాడ నారాయణ మల్లాం రవి కుమార్, చెందేటి సుజాత తుపాకుల కన్నమ్మ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ నిత్యా కృష్ణారెడ్డి, వినుకొండ ధనుంజయ, ఆబోతుల బాబు, హైమావతి పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నిధులు కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలి : ఎంపీపీ కురుగొండ




నాయుడుపేట, జనవరి 5 ప్రభాతవార్త: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వమే నూరు శాతం నిధులు కేటాయించాలని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. సోమవారం నాయుడుపేట మండలంలోని పూడేరు సచివాలయం వద్ద జరిగిన గ్రామసభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి మాట్లాడారు. ఇప్పటివరకు ఉపాధి హామీ పథకం పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు 100 రోజులు పని కల్పించే వారిని తెలిపారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అ జీవిక మిషన్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 60 శాతం నిధులు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. 40శాతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించేలా ప్రణాళికలు రూపొందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూడేరు సర్పంచ్ శాంతమ్మ, ఉప సర్పంచ్ కిరణ్ కుమార్, కార్యదర్శి శేఖర్, పిఎసిఎస్ డైరెక్టర్ పరంధామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లకూరు ఎస్ఐగా ఆదిలక్ష్మి




పెళ్లకూరు, జనవరి 5 ప్రభాతవార్త: పెళ్లకూరు మండలంలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.నాగ రాజు చిట్టమూరు మండలానికి బదిలీ కాగా ఆయన స్థానంలో నాయుడుపేటలో ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న దారం ఆదిలక్ష్మి సోమవారం పెళ్లకూరు పోలీస్ స్టేషన్ నందు బాధ్యతలు స్వీకరించారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే



వెంకటగిరి, జనవరి 5 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వారిని నజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ సభ్యులు బీదా రవిచంద్రతో కలిసి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధి పనులు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై కలెక్టర్‌తో చర్చించడం జరిగింది. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## పదో తేదీ నుండి వికెర్ క్రికెట్ టోర్నమెంట్

బాలాయపల్లి, జనవరి 5 ప్రభాతవార్త: ఈ నెల 10వ తేదీ నుండి 20వ తేదీ వరకు మండలంలోని జైపూర్ గ్రామంలో వికెఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వెన్నోటి కార్తీకరెడ్డి మొదటి బహుమతిగా 20వేల 16 రూపాయలు, రెండో బహుమతి జె రాజా 10 వేల 16 రూపాయలు అందజేస్తారని చెప్పారు. 500 రూపాయల ఎంట్రీ ఫీజు ఉంటుందని తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీ లోపల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## గంగాప్రసాద్‌కు పనబాక పరామర్శ



సూళ్లూరుపేట, జనవరి 5 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలో ప్రముఖ పారిశ్రామికవేత్త, టిడిపి అగ్రనేత కొండేపాటి గంగాప్రసాద్ సోదరుడు సత్యనారాయణ చౌదరి ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి సోమవారం గంగాప్రసాద్ స్వగృహానికి వెళ్లి సత్యనారాయణ చౌదరి చిత్రపటానికి నివాళి అర్పించారు. గంగాప్రసాద్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఎఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులు అవస్థలు



తడ, జనవరి 5 ప్రభాతవార్త : ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులను ఐదు కిలోమీటర్ల వరకు నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది ప్రతిరోజు వేనాడు గ్రామానికి ఉదయం సాయంత్రం విద్యార్థుల కోసం వేనాడు నుండి సూళ్లూరుపేటకు స్పెషల్ బస్సు ను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం విద్యార్థులు ప్రయాణిస్తున్న బస్సు వేనాడు నుండి ఐదు కిలోమీటర్లు వెళ్లిన తర్వాత బ్రేక్ డౌన్ కావడంతో విద్యార్థులను క్రిందకు దించేసి ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ వెళ్లిపోయారు విద్యార్థుల మరలా వేరే బస్సు వస్తుందని వేచి చూసి బస్సు రాకపోవడంతో కాలినడకన ఇంటికి చేరుకున్నారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. ఆర్టీసీ అధికారులు బస్సులో ఏదైనా సమస్యలు ఏర్పడినప్పుడు డిపో నుండి అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి కానీ అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడంతో విద్యార్థులు పాఠశాలకు హాజరు కాలేకపోయారు. అదేవిధంగా కాలినడకన తిరిగి ఇంటికి వెళ్లిన విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని కనీసం తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వలేదని గ్రామస్తులు ఆర్టీసీ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

## రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ



తడ, జనవరి 5 ప్రభాతవార్త: మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా మండలంలో భూములు రీ సర్వే పూర్తయిన గ్రామాల రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టిడిపి తిరుపతి జిల్లా అధ్యక్షురాలు మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి హాజరయ్యారు. వారి చేతుల మీదగా రైతులకు పట్టాదారుపాస్ పుస్తకాలు అందజేశారు. వారు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరిం చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి గ్రామంలో భూముల రీ సర్వే నిర్వహించి రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు నేరుగా రైతులకు ఇంటి వద్దకు చేరే విధంగా చర్యలు చేపట్టారని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమ ప్రభుత్వమని పేర్కొన్నారు. సర్వేలో సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శరత్ బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్ స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామ పంచాయతీ



తడ, జనవరి 5 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా తడ మండలం గ్రద్దగుంట పంచాయతీ నందు గ్రామ సభ నిర్వహించారు. తడ మండల బిజెపి అధ్యక్షులు చిల్లకూరు తేజా రెడ్డి చేతుల మీదగా వికసిత్ భారత్ ఉపాధి హామీ జి రామ్ జీ పోస్టర్ ఆవిష్కరించారు గ్రామాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలని గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామ సర్పంచ్ కాటయ్య, ఏపీవో నాగరాజు సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్‌కు ఘన సన్మానం



తడ, జనవరి 5 ప్రభాతవార్త : ఏపీ బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డైరెక్టర్ల ప్రమాణస్వీకారం విజయవాడలో నిర్వహించారు ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన్ శ్రీధర్, డైరెక్టర్ బొమ్మన్ పళని ను బెస్త సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు ఏకాంబరం, జయపాల్, సురేష్ పూలబాలలు వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు

## తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలికి ఘన సన్మానం



నాయుడుపేట, జనవరి 5 ప్రభాతవార్త : నాయుడుపేట మండల పరిధిలోని విన్నమాల వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టేటి మనోజ్ కుమార్ తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు, టిటిడి బోర్డు మెంబర్ డాక్టర్ పనబాక లక్ష్మిని, సూళ్లూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో వారిని ఘనంగా సత్కరించారు.

## ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

వెంకటగిరి, జనవరి 5 ప్రభాతవార్త : వెలుగొండ అడవుల్లో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలు పట్టుకున్నట్లు అటవీశాఖ రేంజర్ కె.బుజ్జిబాబు తెలిపారు. వెంకటగిరిలోనే అటవీశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటో తారీకు నుండి వెలకొండ అటవి పరిధిలోని దేవులపల్లి నుండి కుర్జా గుంట వరకు పటిష్టమైన గస్తి నిర్వహించి నాలుగో తేదీ రాత్రి సమయంలో సిసి కండ్రి గ్రామ సమీపంలోని మూత గుంట ప్రదేశంలో ఆరుగురు వ్యక్తులు ఎర్రచందనం చెట్లను నరుకుతూ అధికారులకు తారసపడ్డారు అని తెలిపారు. వారిలో నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని చెప్పారు. ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారు వారికోసం గాయంపు చర్యలు చేపట్టామని చెప్పారు. ఈగస్తీలో డిఆర్‌ఓ డక్కిలి సౌత్ సెక్షన్ వరప్రసాద్, వెంకటగిరి డిఆర్ఓ ఎస్ విజయ్ కుమార్, బీట్ ఆఫీసర్లు ఎం రాంబాబు, సందీప్, రహమతుల్లా, పెంచలయ్య, రవి, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

## చదువే ఆయుధం ఎమ్మెల్యే



వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త: పేద బడుగు బలహీన వర్గాలకు విద్య ఆయుధమని గూడూరు శాసన సభ్యుడు సునీల్ కుమార్ విద్యార్థులకు సూచించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు గూడూరు సునీల్ కుమార్ విద్యాసామగ్రిని అందజేశారు. గురుకుల పాఠశాలను, గదులను ఎమ్మెల్యే పరిశీలించారు. హాస్టల్ పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం సిబ్బంది విద్యార్థులు పలికారు. గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయసులోనే చదువుపట్ల ఆసక్తి పెంపొందించుకొని చదివే లక్ష్యంగా విద్యార్థులు చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గురుకుల పాఠశాల ఆవరణలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులు ఎమ్మెల్యే పాఠశాల సిబ్బంది, నాయకులు, నివాళులర్పించారు.

## ఉపాధి పని దినాలు 125 రోజులు ఎమ్మెల్యే




వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త : ఉపాధి కూలీలకు 125 రోజులు పని దినాలుగా పెంచుతూ ఏప్రిల్ మాసం నుండి అమలులోకి వస్తుందని గూడూరు శాసనసభ్యుడు పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణం లో ప్రజా దర్బార్ కార్యక్రమంలో విబిజి రామ్ జి ద్వారా (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్) 125 పని దినాల పోస్టర్స్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు నూరు రోజులు పని దినాలు ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 125 రోజులు పని దినాలుగా పెంచారన్నారు, ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, మండల పార్టీ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ ఎండిఓ దేవదానం, ఏపీడి వరప్రసాద్ రావు, ఏపీవో విజయ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది నాయకులు ప్రజలు తదితరులు ఉన్నారు.

## శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో ఉద్యోగాల లొల్లి

**-విధి నిర్వహణలో చనిపోయిన వారి పిల్లలకు ఉద్యోగాలు ప్రశ్నార్థకం**

శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త: 'ఊరందరిది ఒక దారి అయితే ఉలిపిరికట్టేది' మరొకటి అన్నట్లు మారింది. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పరిపాలన పలు వివాదాలకు కారణమౌతుంది. ముఖ్యంగా ప్రస్తుతం విధి నిర్వహణలో ఉంటూ మృతి చెందిన వారి పిల్లలకు లేదా కుటుంబసభ్యులకు 1005 జిఓ లో అవకాశం కల్పించాలని ప్రభుత్వ జిఓ ఉంది. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో పారిశుద్ధ్య విభాగంలో ఆరుగురు, ఇంజనీరింగ్ విభాగంలో ఆరుగురు విధి నిర్వహణలో ఉంటూ మృతి చెందారు. ఆ స్థానాలను వారి కుటుంబసభ్యులకు అవకాశం కల్పించాలని ఏళ్ళ తరబడి మున్సిపల్ కాంటాక్టు యూనియన్ నాయకులు అధికారులను అభ్యర్థిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ ఉద్యోగాలకు దరఖాస్తులు చేయాలని పత్రికా ప్రకటన జారి చేయటంతో నిరుపేద బాధితులు ఘొల్లుమంటు న్నారు. విధి నిర్వహణలో ఉంటూ మృతి చెందిన వారు ఒక్కొక్కరు 20 సంవత్సరాలకు పైబడి విధి నిర్వహించారు.

**పారిశుద్ధ్య విభాగంలో మృతిచెందిన వారు వీరే:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో చెత్తలు తొలగిస్తూ, కాలువలు శుభ్రం చేస్తూ విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వారిలో పసల శీనయ్య, పసల నాగేంద్ర, కృష్ణారెడ్డి, వెంకటాచలపతి, వెంకటలక్ష్మీ, వెంకటమ్మలు ఉన్నారు. వారి పిల్లలకు ఉద్యోగవ కాశం కల్పించాలని యూనియన్ కోరుతుంది. అయితే వారి పిల్లలు ఇదేశాఖలో వేరేవారి బదులు బదలి వర్కర్లుగా పని చేస్తున్నారు. వారికి రెగ్యూలర్ ఉద్యోగులుగా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని కల్పించాలని కోరుతుంటే ప్రస్తుతం మున్సిపాలిటి ఆ ఉద్యోగాలకు పత్రికా ప్రకటన వెలువడింది. మంగళవారానికి దరఖాస్తులకు చివరి రోజుగా ఖరారు చేసారు. దాంతో ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న వారిని పక్కన పెట్టి కొత్తగా నోటిఫికేషన్ జారి చేయటం ఏమిటని యూనియన్ నాయకులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి ఇంజనీరింగ్ విభాగంలో కూడా చోటు చేసుకుందని చెబుతున్నారు. ఈ నియామకాలకు సంబంధించి ఏదో మర్మం ఉందని కార్మికులు గుస గుస లాడుతున్నారు.

**కమిషనర్ వివరణ:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో చోటు చేసుకున్న వివాదాలకు సంబంధించి ప్రభాతవార్త కమిషనర్ భవాని ప్రసాద్‌ను వివరణ కోరగా ప్రస్తుతం తాము నియమిస్తున్నది కాంటాక్టు ఉద్యోగాలకు సంబంధించినదని వివరించారు. ఇది ఆబ్‌కాస్‌లో నియమించుకుంటున్నామన్నారు. ఒక వేళ మున్సిపాలిటిలో రెగ్యూలర్ ఉద్యోగులు విధి నిర్వహణలో ఉంటూ చనిపోయి ఉంటే వారి కుటుంబానికి సంబంధించిన వారికి ఉద్యోగాలు ఇస్తామన్నారు. అపోహాలు వద్దని వివరించారు.

## రూ 8 లక్షలతో సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త : వాకాడు మండలం నెల్లిపూడి పంచాయతీ పరిధిలోని ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా సుమారు 8 లక్షల రూపాయలతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా సిసి రోడ్డు నిర్మాణమునకు శంకుస్థాపన చేశారు. నెల్లిపూడి గ్రామంలోని నిర్మించునున్న సిసి రోడ్డు వివరాలను సంబంధించిన ఇంజనీర్ ద్వారా ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ నాయకులతో కొంతసేపు అభివృద్ధి సంక్షేమా కార్యక్రమాలపై ఎమ్మెల్యే చర్చించారు. నెల్లిపూడి గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి బాణ సంచాలతో మారుమోగించారు, మండల కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, ఏఎంసి చైర్ పర్సన్ ప్రమీల, పంచాయతీరాజ్ ఇంజనీర్ కిరణ్, హరీష్ నాయుడు, ఎంటిటీ. పోలయ్య, జానకి రామ్ రెడ్డి, నజీర్ బాషా, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, కుంభాల రమణయ్య, నెల్లిపూడి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



బైరెడ్డిపల్లి జనవరి 5 ప్రభాతవార్త : దినపత్రిక యొక్క నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించడం జరిగినది. బైరెడ్డిపల్లి మండలం తెలుగుదేశం అధ్యక్షులు కిషోర్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా కిషోర్ గౌడ్ మాట్లాడుతూ మీడియా అంటే తమకు ఎంత గౌరవం అని ఆదర్శవంతమైన వార్తలను ప్రచురించడంలో ప్రభతవార్త ముందున్నదని అందరూ ఈ వార్త పత్రికను ఆదరించాలని తెలియజేశారు.

## మైక్రో ఇరిగేషన్‌తో రైతుకు సమృద్ధిగా ఆదాయం : కలెక్టర్



చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త: మైక్రో ఇరిగేషన్‌తో రైతులకు సమృద్ధిగా ఆదాయం లభిస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు సమావేశభవనంలో సోమవారం కలెక్టర్ ఎపిఎంఐపి కార్యక్రమం అమలుపై వివిధ కంపెనీలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎపి మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ ద్వారా ఆధునిక సాగునీటి పద్ధతులు ఏర్పాటుకు ఉద్యానవన రైతులకు పెద్ద ఎత్తున సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నా మన్నారు. ఈ పథకం ద్వారా నీటి పొదుపుతో పాటు పంట ఉద్పాదకత, నాణ్యత పెరిగి రైతుల ఆదాయం మెరుగుపడుతుందన్నారు. జిల్లాలోని 31 మండలాల్లో ఇప్పటి వరకు 1.30 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మైక్రో ఇరిగేషన్ వ్యవస్థలు ఏర్పాటు చేయగా, 1.32 లక్షల మంది రైతులు లబ్ధిపొందినట్లు వివరించారు. అలాగే స్ప్రింక్లర్ ఇరిగేషన్‌కు అన్ని వర్గాల రైతులకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎపిఎంఐపి పిడి పివి రమణ, ఎపిడి ఫజురున్నిసా, ఎంఐడిసి నరేష్, వివిధ మైక్రో ఇరిగేషన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బౌల్డరింగ్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలి

**- ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం**



కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త : కుప్ప ంమండలం కంగుంది గ్రామంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో తొలిసారిగా చేపడుతున్న ఇ ంటర్నేషనల్ బౌల్డరింగ్ ఫెస్ట్2026ను విజయవంతం చేయాలని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం కోరారు. సోమవారం కంగుందిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టూరిజంశాఖ, కడద్వారా చేపట్టే ఈ కార్యక్రమం అధికారిక కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంను తదేకం ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్నామన్నారు. ఈనెల 6-10 తేదీల్లో కార్యక్రమాలు ఉంటాయన్నారు. 9న రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆనంరామనారాయణరెడ్డి, ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అయితే కేంద్రంనుంచి పర్యాటక రంగ అభివృద్ధికి నిధులు మంజూరవుతాయ న్నారు. అందరూ జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో తదేకం ఫౌండేషన్ చైర్మన్ సీమ, సర్పంచ్ ధనశేఖర్, మాజీ ఎఎంసి చైర్మన్ సత్యేంద్రశేఖర్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## నగరి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

**సిఎంకు ఎమ్మెల్యే భానుప్రకాశ్ విజ్ఞప్తి-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త : నగరి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన పరిపాలన అనుమతులు, తగినన్ని నిధులు మంజూరు చేసి సహకరించాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. దీని కోసం సోమవారం సచివాలయంలో ఆయన ప్రత్యేకంగా ముఖ్యమంత్రిని కలిశారు. నియోజకవర్గంలోని నగరి, నింద్ర, విజయపురం మండలాలు చిత్తూరు జిల్లాలోనూ, పుత్తూరు, వడమాలపేట తిరుపతి జిల్లాలోనూ వున్నాయని తెలిపారు. పరిపాలన, రవాణా, విద్య, వైద్య సౌకర్యాల దృష్ట్యా చిత్తూరు జిల్లాలో వున్న 3 మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని విజ్ఞప్తి చేశారు. పుత్తూరు ప్రభుత్వాస్పత్రిని 30 పడకల స్థాయి నుంచి 100 పడకల స్థాయికి పెంచాలని కోరారు. మరమగ్గాల కార్మికులకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు విషయమై చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకు సంబంధించి 2024 సంవత్సరానికి ముందు మెడికల్ బిల్లులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయాలన్నారు. వడమాలపేట మండలం ఎస్‌బిఆర్ పురం చెరువు సప్లయి ఛానల్‌కు సిసి లైనింగ్ ఏర్పాటుకు పరిపాలన అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా మరమ్మతులకు గురైన ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తెలిపారు.

## ఉగాది నాటికి టిడ్కో ఇళ్ళు పంపిణికి సిద్ధం



శ్రీకాళహస్తి, జనవరి 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో నిర్మించిన సుమారు 5వేల టిడ్కో ఇళ్ళను ఉగాది నాటికి పూర్తి చేయాలని, సంక్రాంతి నాటికి మౌళిక సదు పాయాలు కల్పించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదేశించారు. శ్రీకాళహస్తికి సమీపంలోని రాజీవ్ నగర్‌కు సమీపంలో 2017లో నిర్మించిన టిడ్కోఇళ్ళను 2019లో అప్పటి శాసనసభ్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి లబ్దిదారులకు లాటరీ పద్దతిలో పంపిణి చేసారు. అయితే తరువాత ప్రభుత్వం మారటంతో టిడ్కో ఇళ్ళ నిర్మాణాల కాంట్రాక్టర్ విరమించుకోవటం ఎన్నికలకు ముందు మళ్ళీ టిడ్కో ఇళ్ళకు రంగులు మార్చారు తప్ప లబ్దిదారులకు ఇవ్వలేదు. అయితే ఈ వైకాపా సీజన్‌లో భారీ ఎత్తున కుంభకోణం చోటు చేసుకుంది. జగనన్న కాలనీ పేరుతో టిడ్కో లబ్దిదారులను గందరగోళం చేసారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పనులు పూర్తి చేయుటకు లబ్దిదారులకు పంచిపెట్టడానికి పరుగులు తీస్తున్నారు. అయితే రెండు నెలలుగా ఎంఎల్ఏ సుదీర్‌రెడ్డి చొరవతో వైకాపా రంగులను మార్చారు. అంతేకాక మౌళిక సదుపాయాల కల్పనకు పనులు చేపట్టారు. ఈ పరిశీలనల్లో టిడ్కో ఇఇ దేవకి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, డిఇఇ వెంకటేశ్, ఎఇఇ అపర్ణ, మున్సిపల్ అధికారి శ్రావణి, తెలుగుదేశం పార్టీకి చెందిన షాకీర్ అలి, బషీర్, కాసరం రమేష్, మునిరాజాయాదవ్, గాదిపాకుల కిరణ్, నాగమల్లి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళలకు చీరలు, బట్టలు పంపిణీ



వాకాడు, జనవరి 5 ప్రభాతవార్త: మండలంలోని కొండూరు పంచాయతీ గిరిజన కాలనీలోని సోమవారం సన్నారెడ్డి మనవల్లు, మనవరాలు, కుటుంబ సభ్యుల దాతృత్వంతో గిరిజన మహిళలకు చీరలు బట్టలు పంపిణీ చేశారు. వాకాడు గ్రామానికి చెందిన వ్యాపారవేత్తలు, వైసీపీ నాయకులు సన్నారెడ్డి చంద్రభూషణ్ రెడ్డి, రామచంద్రారెడ్డి వెంకట కృష్ణారెడ్డి, తల్లి సన్నారెడ్డి సరసమ్మ జ్ఞాపకార్థం సందర్భంగా ఐదో వర్ధంతి పురస్కరించుకొని 200 మంది గిరిజన మహిళలకు చీరలు, బట్టలు, పంపిణీ కార్యక్రమం చేసి, అనంతరం జ్ఞాపకార్ధ కార్యక్రమంలో వచ్చేటువంటి అందరికీ తేనీటి విందు ఇచ్చారు. అమ్మ జ్ఞాపకార్థంగా పలు కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

## హెల్మెట్ ధరించకపోతే జరిమానా : ఎంఇఓ

పుత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త : మోటారు వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 194డి ప్రకారం ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని లేని పక్షంలో రూ. 1000 జరిమానా చెల్లించాల్సి వుంటుందన్నారు. దాంతో పాటు మూడు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేస్తామని పుత్తూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి పి.చంద్రశేఖర్ హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవడంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు హెల్మెట్ ధరించాలనే విషయం అర్థం చేసుకోవాలని కోరారు. అందువల్ల ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చున్న వారు



సైతం కచ్చితంగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.


## చెరువు వేలం ప్రకటన

తిరుపతి జిల్లా, దక్కిలి మండలం, దేవులపల్లి గ్రామ పంచాయతీలో ఉన్న క్రింది తెలిపిన చెరువులో చేప పిల్లలను పెంచి **1435** ఫసలీకి అనుభవించుటకు గాను **8-1-2026** గురువారం సాయంత్రం 4గంటలకు బహిరంగ వేలం పాట దేవులపల్లి ఎంపిపి స్కూల్ వద్ద జరుగును. కావున వేలం పాటలో పాల్గొనదలిచిన వారు క్రింది తెలిపిన దరావత్తు చెల్లించి పాల్గొనవలెను. ఇతర విషయములు కార్యాలయం పనిచేయు సమయంలో తెలుసుకొనగలరు.

| వ.నెం. | చెరువుపేరు | కనిష్ట మద్దతు ధర | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | దేవులపల్లి | చెరువు రు.56,000/-<br>దరావత్తు రు.14,000/- | 1435 ఫసలీ |

సం/- డి.మాధవి, పంచాయతీ కార్యదర్శి,
దేవులపల్లి గ్రామ పంచాయతీ, దక్కిలి మం॥